



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 12 సంచిక : 222 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 17 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :222 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 17 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం...

### స్వయంగా తన వివరాలు నమోదు చేసుకున్న సీఎం చంద్రబాబు

- ఏపీలో ఇంటింటి గణన, గృహాల జాబితా సేకరణ ప్రారంభం
- స్వీయ నమోదు ప్రక్రియను ఆరంభించిన సీఎం చంద్రబాబు
- ఆన్‌లైన్‌లో తన వివరాలను స్వయంగా నమోదు చేసుకున్న ముఖ్యమంత్రి
- మొత్తం 33 ప్రశ్నలతో కూడిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ
- ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు వివరాలు నమోదు చేసుకునే అవకాశం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో గురువారం ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. హౌస్ లిస్టింగ్-హౌస్ సెన్సెస్ ప్రక్రియలో భాగంగా, తొలి వ్యక్తిగా తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



మిగతా 2లో

## లోక్‌సభలో.. గరం గరం!




### మూడు కీలక బిల్లులు ప్రవేశపెట్టిన కేంద్రం

- మహిళా రిజర్వేషన్లు, రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్ బిల్లు
- మెజార్టీ సభ్యుల మద్దతుతో చర్చకు ఆమోదం
- సుమారు 15 నుంచి 18 గంటల పాటు చర్చ సాగే అవకాశం
- దీనిపై నేడు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్
- మహిళా బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ
- బిల్లు ఆమోదానికి తొందరెందుకన్న అఖిలేష్ యాదవ్
- ఇప్పటికే తమ అభిప్రాయం చెప్పామన్న సోనియా గాంధీ
- ఎప్పుడో ఆమోదం పొందిన బిల్లుపై మళ్లీ చర్చా.. ప్రధాని మోదీని నిలదీసిన ఎంపీ కేసీ వేణుగోపాల్
- ఘాటుగా కౌంటర్ ఇచ్చిన హోమ్ మంత్రి అమిత్ షా

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు కీలక బిల్లులపై చర్చించేందుకు లోక్సభ లాంఛనంగా ఆమోదం తెలి పింది. మహిళా రిజర్వేషన్లు, నియోజక వర్గాల పునర్విభజన తదితర అంశా లతో కూడిన ఈ బిల్లులపై సభలో సభ్యులు సుదీర్ఘంగా చర్చలు జరపను న్నారు.కేంద్రం ప్రతిష్టాత్మకంగా తీసు కువచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లులకు ఈ చర్చల జాబితాలో చోటు దక్కింది. ఈ బిల్లులపై విపక్ష, అధికార పక్ష సభ్యుల వాడివేడి చర్చల అనంతరం (శుక్రవారం) సాయంత్రం సరిగ్గా 4 గంటలకు మూడు బిల్లులపైన ఓటింగ్ నిర్వహి చనున్నట్లు స్పీకర్ ఓం బిర్లా అధికారి కంగా ప్రకటించారు.

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై (నారీ శక్తి వందన్ అధినియం) పార్లమెంటులో వాడివేడి చర్చ జరిగింది. ఈ బిల్లులో ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలన్న డిమాండ్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఈ చర్చలో అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ.. మహిళలకు కేటాయించిన 33శాతం రిజర్వేషన్లలో వెనుకబడిన వర్గాలు (ఓబీసీ), ముస్లిం మహిళలకు ప్రత్యేకంగా ఉప-కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అఖిలేశ్ డిమాండ్‌పై అమిత్ షా తీవ్రంగా స్పందించారు. భారత రాజ్యాంగం ప్రకారం మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడం అసాధ్యమని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నాయని విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి ఇది పూర్తిగా విరుద్ధమని ప్రభుత్వం తరఫున

మిగతా 2లో



## తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే...

### నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

- తెలంగాణ కుల సర్వే అధికారిక గణంకాలను విడుదల చేసిన ప్రభుత్వం
- రాష్ట్రంలో 56.36 శాతంతో బీసీలదే అగ్రస్థానం అని వెల్లడి
- జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో
- ఓసీల్లో రెడ్డి, ఎస్టీల్లో లంబాడీల జనాభా అత్యధికం
- దాదాపు 4 శాతం మంది ప్రజలు తమకు కులం లేదని వెల్లడించిన వైనం

మిగతా 2లో



## అనిల్ అంబానీకి సుప్రీంకోర్టులో చుక్కెదురు

- రిలయన్స్ కమ్యూనికేషన్స్ రుణ ఖాతాలను మోసపూరిత ఖాతాలుగా ప్రకటించిన బ్యాంకులు
- మోసపూరిత ఖాతాల విషయంలో చర్యలకు అనుమతించిన బాంబే హైకోర్టు
- సుప్రీంకోర్టులో సవాల్ చేసిన అనిల్ అంబానీ

పెన్ పవర్ డెస్క్: రిలయన్స్ కమ్యూనికేషన్స్ గ్రూప్ కంపెనీల రుణ ఖాతాలను మోసపూరితమైనవిగా పేర్కొనడాన్ని సవాల్ చేస్తూ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

మిగతా 2లో

## గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000...

### భారీ హామీలతో 'టీవీకే' మానిఫెస్టో ఆవిష్కరించిన విజయ్

- 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కోసం టీవీకే మేనిఫెస్టో విడుదల
- గృహిణులకు నెలకు రూ.2,500, నిరుద్యోగ భృతిగా రూ.4,000 హామీ
- ఏడాదికి 6 గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- పాలన, విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
- తమిళనాడును డ్రగ్ ఫ్రీ రాష్ట్రంగా మార్చడమే లక్ష్యం

మిగతా 2లో



## ఏపీలో భగ్గుమన్న సూరీడు.. నంద్యాలలో 45.1 డిగ్రీలు..

## నేడు మరింత తీవ్రత!

- ఏపీలో రికార్డు స్థాయికి ఉష్ణోగ్రతలు
- నంద్యాల జిల్లాలో 45.1 డిగ్రీలకు చేరిన గరిష్ఠ ఉష్ణోగ్రత
- పలు జిల్లాల్లో 44 డిగ్రీలు దాటే అవకాశం ఉందని అంచనా
- రాష్ట్రంలోని 85 మండలాల్లో వడగాలులు వీస్తాయని హెచ్చరిక
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించిన విపత్తుల నిర్వహణ సంస్థ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. గురువారం నాడు రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా, కడప జిల్లా ఒంటిమిట్టలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలో

మిగతా 2లో





## నారీ శక్తి చట్టం చరిత్రాత్మకం

- మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మక ముందడుగు అని కొనియాడిన పవన్
- మహిళా సాధికారతకు జనసేన పార్టీ కట్టుబడి ఉందని స్పష్టీకరణ
- వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ప్రస్తావించిన పవన్
- నారీశక్తి అనేది నినాదం కాదని, మన నాగరికతకు బలమని వ్యాఖ్య
- రాజ్యాంగ రూపకల్పనలో మహిళల పాత్రను గుర్తు చేసుకున్న జనసేనాని

మిగతా 2లో

## జగన్ బతుకే ఒక అరాచకం

### మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్

- ఐదేళ్లు జువ్వలదిన్నె హార్బర్‌ను అడ్డుకున్నది జగనే అని ఆరోపణ
- మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీశారని ఘాటు వ్యాఖ్యలు
- దేశ రక్షణ సంస్థను వ్యతిరేకించడం జగన్ దుర్మార్గపు ఆలోచన అని ఘాటు విమర్శలు
- గొడ్డలి రాజకీయమే జగన్ విధానమని తీవ్ర స్థాయిలో ధ్వజం

మిగతా 2లో





## ప్రభుత్వ పాఠశాలల పనులు ఇకపై ఎస్ఎంసీలకే...

- పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష
- అన్ని ప్రభుత్వ స్కూళ్లను 3 స్టార్‌కు చేర్చాలని ఆదేశం
- ప్రవేశాల పెంపునకు డోర్ టు డోర్ క్యాంపెయిన్‌కు పిలుపు
- ప్రభుత్వ కాలేజీల్లో టాపర్లకు విస్తృత ప్రచారం కల్పించాలని సూచన

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే దిశగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలక ఆదేశాలు జారీ చేశారు.

మిగతా 2లో



## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల దిశ, దశ మారతాయి

- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- బిల్లుపై మూజువాణి ఓటింగ్‌ను వ్యతిరేకించి డివిజన్‌కు పట్టుబట్టిన విపక్షాలు
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 251, వ్యతిరేకంగా 185 ఓట్లు
- బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని పార్టీలకు ప్రధాని విజ్ఞప్తి

మిగతా 2లో



## రేవంత్ రెడ్డి వాదన విని తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు

- డీలిమిటేషన్‌కు జీఎస్‌డీపీని ముడిపెట్టడం మూర్ఖత్వమన్న తేజస్వీ సూర్య
- నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని హామీ
- ఏపీ, తెలంగాణలను కాంగ్రెస్ విభజించిన తీరు బ్రిటిష్ కంటే దారుణంగా ఉందని వ్యాఖ్య
- కాంగ్రెస్ చేసిన విభజన కారణంగా ఏపీ, తెలంగాణ మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం ఉందన్న ఎంపీ

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## అనిల్ అంబానీకి సుప్రీంకోర్టులో చుక్కెదురు

- మొదటి పేజి తరువాయి

రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు చెందిన మోసపూరిత ఖాతాల విషయంలో చర్యలకు బాంబే హైకోర్టు అనుమతించడాన్ని ఆయన సవాల్ చేయగా, సుప్రీంకోర్టులో చుక్కెదురైంది.
ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తన నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే బ్యాంకులిచ్చిన షోకాజ్ నోటీసులపై హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ వద్ద తన వాదనలు వినిపించుకోవడానికి అనిల్ అంబానీకి అనుమతిచ్చింది. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని హైకోర్టుకు సూచించింది.
బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకులు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఖాతాలను మోసపూరితమైనవిగా ప్రకటించాయి. బ్యాంకులు చేసిన ప్రకటనపై అనిల్ అంబానీ బాంబే హైకోర్టులో సవాల్ చేశారు. విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్, వాటిపై స్టే విధించడంతో పాటు భవిష్యత్తులో చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇచ్చింది. మోసపూరిత ఖాతాలుగా గుర్తించే విషయంలో ఆర్బీఐ మార్గదర్శకాలు పాటించలేదని పేర్కొంది.దీనితో మూడు బ్యాంకులు అప్పీలుకు వెళ్లాయి. విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను కొట్టివేసింది. ఈ క్రమంలో అనిల్ అంబానీ డివిజన్ బెంచ్ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, చుక్కెదురైంది.

## తెలంగాణలో టాప్ 3 కులాలు ఇవే... నివేదిక విడుదల చేసిన ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన అధికారిక గణంకాలను విడుదల చేసింది. ఈ సర్వే ప్రకారం రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతులు (బీసీలు) 56.36 శాతంతో అతిపెద్ద సామాజిక వర్గంగా నిలిచారు. జనాభా పరంగా మాదిగ, షేక్ ముస్లిం, ముదిరాజ్ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోనే ఆదర్శవంతంగా, అత్యంత పారదర్శకంగా ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేశామని ప్రభుత్వం ప్రకటించింది.ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.03 లక్షల మంది ప్రభుత్వ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేశారు. ప్రజల నుంచి 'సెల్ఫ్ డిక్లరేషన్' పద్ధతిలో వివరాలను సేకరించారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 1,12,36,849 కుటుంబాలను సర్వే బృందాలు సందర్శించి, 3,55,50,759 మంది జనాభా వివరాలను నమోదు చేసినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది.

**సామాజిక వర్గాల వారీగా జనాభా వాటా**

సర్వే ఫలితాల ప్రకారం, రాష్ట్ర జనాభాలో బీసీల తర్వాత షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు) 17.42 శాతం, అగ్రవర్ణాలు (ఓసీలు) 15.79 శాతం, షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) 10.43 శాతం చొప్పున ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుమారు 4 శాతం మంది ప్రజలు తమకు ఎలాంటి కులం లేదని (చీశీ ఝుర్వ) తమ డిక్లరేషన్‌లో పేర్కొనడం గమనార్హం.

**కులాల వారీగా ప్రధాన వర్గాలు**

రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన కులాల జాబితాను పరిశీలిస్తే, 36.58 లక్షల మందితో (10.3 శాతం) మాదిగ సామాజిక వర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 27.96 లక్షల మందితో (7.9 శాతం) షేక్ ముస్లింలు రెండో స్థానంలో, 26.39 లక్షల జనాభాతో (7.4 శాతం) ముదిరాజ్ సామాజిక వర్గం మూడో స్థానంలో ఉన్నాయి.
ఓసీ వర్గాల్లో: రెడ్డి సామాజిక వర్గం 4.8 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కోమటి (1.4 శాతం), కమ్మ (1.0 శాతం), బ్రాహ్మణ (0.9 శాతం), కాపు/నాయుడు (0.7 శాతం), వెలమ (0.4 శాతం) ఉన్నారు.
బీసీ వర్గాల్లో: షేక్ ముస్లింలు (7.9 శాతం) అత్యధిక జనాభాతో ముందుండగా, ముదిరాజ్ (7.4 శాతం), యాదవ (5.7 శాతం), గౌడ్ (4.6 శాతం), మున్నూరుకాపు (3.9 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచారు.
ఎస్సీ వర్గాల్లో: మాదిగ (10.3 శాతం) సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగి ఉండగా, మాల (4.1 శాతం), బేడా (0.5 శాతం), మాల సేల్ (0.5 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.
ఎస్టీ వర్గాల్లో: లంబాడీలు 6.8 శాతం జనాభాతో అగ్రస్థానంలో నిలిచారు. కోయ (1.2 శాతం), గోండ్ (1.1 శాతం), ఎరుకుల (0.5 శాతం) వారి తర్వాత ఉన్నారు.
ఈ సర్వే ద్వారా వెల్లడైన గణంకాలు భవిష్యత్తులో ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాల రూపకల్పన, రాజకీయ సమీకరణాల్లో కీలక పాత్ర పోషించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఏపీలో ఇంటింటి గణన ప్రారంభం...

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ప్రజలందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములై, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.అమరావతిలోని తన నివాసంలో ౦వ.ఔవఅ౦బ౦.ప్రశీజ.ఱఅ వెబ్ సైట్ ద్వారా చంద్రబాబు వ్యక్తిగత వివరాలను నమోదు చేశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఏపీ జనగణన డైరెక్టర్ జె. నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్ల వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, మే 1 నుంచి 30 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వచ్చి భౌతికంగా వివరాలు సేకరిస్తారని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పౌరులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సమానంగా అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనికోసం కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం అవసరమని, ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో జనగణన జరగడం ఇదే తొలిసారి అని, ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు.జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో భాగంగా ప్రస్తుతం ఇళ్ల గణన ప్రారంభమైందని, వచ్చే ఏడాది రెండో దశలో జనాభా లెక్కల సేకరణ చేపడతారని సీఎం వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ నమోదు అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ సరైన వివరాలు నమోదు చేసి ఈ బృహత్కార్యాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఏపీలో భగ్గుమన్న సూరీడు.. నంద్యాలలో 45.1 డిగ్రీలు..

- మొదటి పేజి తరువాయి

ఎండల తీవ్రతకు ఇది అద్దం పడుతోంది.ఈ నేపథ్యంలో, రాబోయే 24 గంటల్లోనూ ఎండల తీవ్రత కొనసాగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. శుక్రవారం (ఏప్రిల్ 17) కూడా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా మన్యం, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరుతో పాటు రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠంగా 43 నుంచి 44.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయని పేర్కొంది.అంతేకాకుండా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఏపీఎస్డీఎంఏ హెచ్చరించింది. మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి, పోలవరం ప్రాంతాల్లోని సుమారు 30 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 55 మండలాల్లో సాధారణ వడగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది.ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లవద్దని సూచించింది. వృద్ధులు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

# లోక్‌సభలో.. గరం గరం!

- మొదటి పేజి తరువాయి

ఆయన గట్టిగా వాదించారు. ఈ బిల్లును వెంటనే అమలు చేయకుండా జనాభా గణన (సెన్సస్), నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అమలు చేస్తామని చెప్పడంపైనా విపక్షాలు అభ్యంతరం తెలిపాయి. ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందని అఖిలేశ్ యాదవ్‌తో పాటు ఇతర ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం కాగా, ఓబీసీ, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా లేకపోవడమే ప్రస్తుత వివాదానికి కేంద్ర బిందువుగా మారింది.

**మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన అసదుద్దీన్ ఒవైసీ**

పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును మజ్లిస్ పార్టీ వ్యతిరేకించింది. పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ఈ రోజు మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టింది. సభలో వివిధ పార్టీలు డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాయి. మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించారు.
ఈ బిల్లును నిరసిస్తూ ఆయన సాహిర్ లుధియాన్వి రాసిన ఒక కవితను లోక్ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆరోపించారు. ఈ బిల్లు జనాభా ఎక్కువగా ఉన్నరాష్ట్రాలకు మరింత అధికారం ఇస్తుందని అన్నారు.
డీలిమిటేషన్ బిల్లుపై ఆయన మాట్లాడుతూ, బిల్లు ప్రజాస్వామ్య, సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. దక్షిణాది ప్రాంతాలకు సభలో ప్రాతినిధ్యం లేకుండా ఈ బిల్లు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్, ఎస్పీ, డీఎంకే సహా వివిధ పార్టీలు వ్యతిరేకించాయి.

## గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4,000... భారీ హామీలతో 'టీవీకే' మానిఫెస్టో ఆవిష్కరించిన విజయ్

నటుడి నుంచి రాజకీయ నేతగా మారిన విజయ్, తన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని రాబోయే ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, భారీ సంక్షేమ పథకాలు, టెక్నాలజీ ఆధారిత పాలన హామీలతో కూడిన పార్టీ మేనిఫెస్టోను గురువారం సాయంత్రం విడుదల చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా పునర్నిర్మించేందుకు రంగాలవారీగా సంస్కరణలు చేపడతామని ప్రకటించారు. సంప్రదాయ సంక్షేమ పథకాలతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను పాలనలో ప్రవేశపెట్టడం ద్వారా వినూత్న మార్పునకు శ్రీకారం చుడతామని విజయ్ స్పష్టం చేశారు.ప్రజాకర్షక పథకాలకు మేనిఫెస్టోలో పెద్దపీట వేశారు. గృహిణులకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు రూ.4,000, డిప్లొమా హోల్డర్లకు ?2,500 భృతి అందిస్తామని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఐదు లక్షల మందికి రూ.18,000 చొప్పున ఉపాధి ఆధారిత మద్దతు పథకాన్ని ప్రకటించారు. దీంతో పాటు, ఇంటర్న్‌షిప్ చేసే యువతకు రూ.5,000 నుంచి రూ.8,000 వరకు స్టైఫండ్ ఇస్తామని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందించే పింఛనును నెలకు రూ.3,000కు పెంచుతామని, దాదాపు 15 లక్షల మందికి ఈ ప్రయోజనం చేకూరుస్తామని పేర్కొన్నారు.మహిళా సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, పేద యువతుల వివాహానికి ఒక సవర బంగారం, పట్టు చీరతో కూడిన ఆర్థిక సహాయం అందిస్తామని వాగ్దానం చేశారు. ప్రభుత్వ భూముల్లో అర్హులైన వారికి ఉచితంగా ఇంటి పట్టాలు ఇస్తామన్నారు.
ఆరోగ్య రంగంలో ఉచిత వైద్య పరీక్షలు, తక్కువ ధరలకే మందులు, క్యాన్సర్ బాధితుల కోసం ప్రత్యేక బీమా సౌకర్యం కల్పిస్తామని టీవీకే హామీ ఇచ్చింది. ప్రాథమిక సేవలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు, ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించారు.
రైతులకు అండగా నిలుస్తూ, ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతుల రుణాల్లో 50 శాతం మాఫీ చేస్తామని, సౌరశక్తి ప్రాజెక్టులను ప్రోత్సహిస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారు. మత్స్యకారులకు కనీస మద్దతు ధర, చేపల వేట లేని సమయంలో రూ.27,000 ఆర్థిక సహాయం, రూ.25 లక్షల బీమా కవరేజీ కల్పిస్తామన్నారు.ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి అంగన్‌వాడీ సిబ్బందికి రూ.18,000, పారిశుద్ధ్య కార్మికులకు రూ.10,000 వేతనం, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు రూ.15 లక్షల ప్రయోజనం కల్పిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తూ, "డ్రగ్-ఫ్రీ తమిళనాడు" కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని విజయ్ ప్రకటించారు. ఆర్థికంగా, 2036 నాటికి తమిళనాడును 1.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం రూ.15,000 కోట్లతో భద్రతా నిధిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ మేనిఫెస్టో ద్వారా సంక్షేమ పథకాలను, టెక్నాలజీ ఆధారిత అభివృద్ధిని జోడించి ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు టీవీకే సిద్ధమవుతోంది.

## జగన్ బతుకే ఒక అరాచకం

వైసీపీ అధినేత జగన్ నిన్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యల పట్ల మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో స్పందించారు. జగన్ బతుకే ఒక అరాచకమని, ఆయనకు అభివృద్ధి చేయడం తెలియదని, గొడ్డలి రాజకీయమే తెలుసని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుండటాన్ని చూసి ఓర్వలేకే జగన్ కులాల మధ్య చిచ్చుపెట్టి అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. గురువారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో జగన్ దుష్ప్రచారం చేస్తున్నారని రవింద్ర మండిపడ్డారు. "ఐదేళ్ల పాటు నిధులు, బిల్లులు ఇవ్వకుండా హార్బర్ నిర్మాణాన్ని అడ్డుకుని, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసింది జగన్. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు వేగవంతం చేసి, 901 మీటర్ల జెట్టీ, కోల్డ్ స్టోరేజ్‌లతో ఆధునిక హార్బర్‌గా పూర్తి చేస్తుంటే.. మత్స్యకారులను రెచ్చగొట్టేలా అసత్యాలు మాట్లాడుతున్నారు" అని విమర్శించారు.

**దేశ రక్షణ సంస్థపై జగన్ వైఖరి దుర్మార్గం**

జువ్వలదిన్నెలో దేశ రక్షణకు కీలకమైన 'సాగర్ డిఫెన్స్' సంస్థకు కేంద్ర అనుమతితో భూమి కేటాయిస్తే, దానిని తరిమికొడతాననడం జగన్ దుర్మార్గపు ఆలోచనకు నిదర్శనమని కొల్లు రవింద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "తల్లి, చెల్లిని వెళ్లగొట్టారు, సొంత బాబాయినే వేసేశారు. ఇప్పుడు దేశ రక్షణ సంస్థను కూడా తరిమికొడతానంటున్నారు. అంటే జగన్‌కు దేశం మీద కూడా భక్తి లేదు. ఆయనకు తెలిసింది గొడ్డలి పార్టీ, గొడ్డలి గుర్తు.. నరుక్కుంటూ పోవడమే" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**అభివృద్ధి, పెట్టుబడులకు జగన్ శత్రువు**

గత ఐదేళ్లలో 800 పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమికొట్టిన చరిత్ర జగన్‌దని రవింద్ర ఆరోపించారు. "కియా, అమరరాజా వంటి సంస్థలను బెదిరించి పొరుగు రాష్ట్రాలకు పంపారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారు. నేను వస్తే చట్టాలు మార్చేస్తానంటూ పెట్టుబడిదారులను మళ్లీ భయపెట్టాలని చూస్తున్నారు. విధ్వంసమే నైజంగా ఉన్న జగన్‌ను ప్రజలు నమ్మకే 11 సీట్లకు పరిమితం చేశారు" అని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, జీవో 217ను రద్దు చేసి, వేట నిషేధ భృతిని పెంచి, వారికి అండగా నిలుస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

**తమిళనాడు బోట్ల విడుదల అంశంలో జగన్ దుష్ప్రచారం**

తమిళనాడు మత్స్యకారుల బోట్లను పట్టుకున్న తర్వాత, వాటిని యువనేత నారా లోకేశ్ చెప్పడం వల్లే పోలీసులు విడుదల చేశారని జగన్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం, దురదృష్టకరం అని కొల్లు రవీంద్ర కొట్టిపడేశారు. ఈ అంశాన్ని రాజకీయంగా మార్చి లబ్ది పొందాలని జగన్ ప్రయత్నించడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి, ఈ బోట్ల విషయంలో స్థానిక గ్రామాల ప్రజలు జోక్యం చేసుకున్నారని వెల్లడించారు. "ఇది మా గ్రామాల మధ్య ఉన్న సమస్య. మేమే చర్చించుకుని పరిష్కరించుకుంటాం" అని వారు కోరారని తెలిపారు. వారి అభిప్రాయాన్ని, ఐక్యతను గౌరవిస్తూ, వారి నిర్ణయం ప్రకారమే మేము ముందుకు వెళ్లాం... అంతేకానీ, ఇందులో లోకేశ్ గారి ప్రమేయం ఉందనడం పచ్చి అబద్ధం అని కొల్లు రవీంద్ర వివరించారు."నిజానికి, సముద్ర గస్తీ విషయంలో గత జగన్ ప్రభుత్వ హయాంలోనే తీవ్ర నిర్లక్ష్యం జరిగింది. 2017 వరకు ఇతర రాష్ట్రాల బోట్లు రాకుండా మెరైన్ బోట్లు గస్తీ కాస్తుండేవి. కానీ 2019 తర్వాత ఆ గస్తీ పూర్తిగా నిలిచిపోయింది. బోట్ల రిపేర్లు, మెయింటెనెన్స్‌కు నిధులు ఇవ్వకపోవడం, సిబ్బందిని తొలగించడం వంటి చర్యలతో సముద్ర సరిహద్దులు బలహీనపడ్డాయి. ఆ కారణంగానే తమిళనాడు బోట్లు మన సముద్ర జలాల్లోకి చొరబడి మత్స్య సంపదను దోచుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని గుర్తించిన వెంటనే చంద్రబాబు నాయుడు గారు, నారా లోకేశ్ గారు అధికారులను అప్రమత్తం చేశారు. తక్షణమే 650 హార్స్ పవర్ ఇంజిన్లతో కూడిన స్పీడ్ బోట్లను ఏర్పాటు చేసి గస్తీని పటిష్టం చేశాం. అక్రమంగా ప్రవేశిస్తున్న బోట్లను నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం.
వాస్తవాలు ఇలా ఉంటే, జగన్ మాత్రం నిజాన్ని దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు" అని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు.

## మహిళా బిల్లుతో దేశ రాజకీయాల దిశ, దశ మారతాయి

మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు నిర్ణయాధికార ప్రక్రియలో పాలుపంచుకోవడం ద్వారా దేశానికి కొత్త దిశానిర్దేశం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కీలక బిల్లును గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు.
కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్... రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026, డీలిమిటేషన్ బిల్లు, 2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2026లను సభ ముందు ఉంచారు. అయితే, ఈ బిల్లును ప్రవేశపెట్టే సమయంలో విపక్షాలు మూజువాణి ఓటింగ్‌ను అంగీకరించలేదు. ఓట్ల విభజన (డివిజన్)కు పట్టుబట్టడంతో సభలో ఓటింగ్ నిర్వహించాల్సి వచ్చింది.బిల్లు ప్రవేశపెట్టడానికి అనుకూలంగా 251 ఓట్లు, వ్యతిరేకంగా 185 ఓట్లు పోలైనట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా లోక్‌సభలో మూజువాణి ఓటు ద్వారానే తీర్మానాలు ఆమోదిస్తారు. కానీ, ఫలితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పుడు సభ్యుల కోరిక మేరకు డివిజన్ నిర్వహిస్తారు. ఆటోమేటిక్ ఓట్ రికార్డర్ వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత ఓటు స్లిప్పుల ద్వారా జరిగిన ఓటింగ్‌లో మొత్తం 333 మంది సభ్యులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, పార్టీలు ఈ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దని విజ్ఞప్తి చేశారు. వికసిత భారత్ ఏ2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో మహిళా రిజర్వేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారికి మహిళా ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

## రేవంత్ రెడ్డి వాదన విని తెలంగాణ ప్రజలు నవ్వుతున్నారు

డీలిమిటేషన్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వితండవాదం చేస్తున్నారని, ఆయన చెబుతున్నది విని తెలంగాణ ప్రజలు కూడా నవ్వుతున్నారని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య అన్నారు. రాష్ట్రాల జీఎస్‌డీపీ ఆధారంగా లోక్ సభ సీట్ల సంఖ్యను పెంచాలన్న రేవంత్ రెడ్డి ప్రతిపాదనపై ఆయన మండిపడ్డారు. సీట్ల పెంపునకు, జీఎస్‌డీపీ ముడిపెట్టాలన్న తెలంగాణ సీఎం సలహా అత్యంత మూర్ఖంగా ఉందని అన్నారు. అసలు ఆయనకు ఆ సలహా ఎవరిచ్చారో కానీ అందరూ నవ్వుతున్నారని చురక అంటించారు. లోక్ సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విపక్ష పార్టీలు, దక్షిణాది పార్టీల వ్యాఖ్యలను సూర్య తప్పుబట్టారు. డీలిమిటేషన్‌పై విపక్షాల వాదన అర్థరహితంగా ఉందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. డీలిమిటేషన్‌పై ప్రతిపక్షాలు దక్షిణాది రాష్ట్రాల ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాల ఆదాయం అనేది ప్రతి సంవత్సరం మారుతుందని తెలిపారు. దానిని డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవాలని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఆదాయం ప్రకారం ఓట్లు లేదా ప్రాతినిధ్యం ఇవ్వాలనుకుంటే దేశంలో అత్యధిక ఆదాయం ఉన్న అంబానీకి లక్ష ఓట్లు ఇవ్వవలసి వస్తుందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాలు మహిళా రిజర్వేషన్ బిల్లును పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పుడు కూడా మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడానికే చూస్తున్నాయని అన్నారు. డీలిమిటేషన్‌ను సాకుగా చూపి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వేగంగా అమలు చేద్దామంటే విపక్షాలు యూటర్న్ తీసుకుంటున్నాయని అన్నారు.కాంగ్రెస్ నాడు అత్యంత దారుణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను విభజించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన విభజన బ్రిటిష్ వారి కంటే దారుణంగా ఉందని అన్నారు. ఏపీ, తెలంగాణ విభజనను కాంగ్రెస్ పాకిస్థాన్, భారత్ విభజనతో పోల్చారు. విభజన సమయంలో కాంగ్రెస్ అనుసరించిన విధానం వల్ల రెండు రాష్ట్రాల మధ్య నేటికీ ఘర్షణ వాతావరణం నెలకొందని అన్నారు.

## నారీ శక్తి చట్టం చరిత్రాత్మకం

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకువచ్చిన 'నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లు' ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా పాలనలో వారికి సముచిత స్థానం దక్కుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా సాధికారతకు జనసేన పార్టీ మాటలతో కాకుండా చేతలతో ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్న పవన్ కల్యాణ్, "2019 ఎన్నికల్లో మేము వాగ్దానం చేసినట్లుగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల పట్ల మా నిబద్ధత, సమాన అవకాశాలు, సరైన ప్రాతినిధ్యంపై మాకున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది" అని తెలిపారు. మహిళలు సమాజానికి పునాది అని, కుటుంబాలను తీర్చిదిద్దడం నుంచి దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడం వరకు వారి పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. "మహిళ ఎదిగితే దేశం ఎదుగుతుంది. ఇది వారికి కొత్త హక్కులు ఇవ్వడం కాదు, వారికి న్యాయంగా చెందాల్సిన వాటిని తిరిగి ఇవ్వడం. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను నిర్మిస్తారు. బలమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయి. ఇకపై 'నారీ శక్తి' కేవలం నినాదం కాదు, మన నాగరికతకు బలంగా నిలుస్తుంది. న్యాయమైన, సమానమైన, సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించడానికి ఈ స్ఫూర్తితో ముందుకు సాగుదాం" అని పవన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ఆయన కొనియాడారు. సైప్రస్‌లో జరిగిన ఉమెన్స్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో గెలిచి, ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌కు సవాల్ చేసే హక్కును పొందిన తొలి భారతీయ మహిళగా ఆర్. వైశాలి చరిత్ర సృష్టించడాన్ని ప్రస్తావించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఇస్రో శాస్త్రవేత్త రీతూ కరిధాల్ నుంచి ఒలింపిక్స్‌లో పీవీ సింధు, మీరాబాయి చాను, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ వరకు ఎందరో మహిళలు దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన దాక్షాయణి వేలాయుధన్, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మి పండిట్, రాజకుమారి అమృత్ కౌర్ వంటి వారి సేవలను పవన్ గుర్తు చేసుకున్నారు. "ప్రతిభకు అవకాశం తోడైనప్పుడు, మహిళలు నాయకత్వం వహిస్తారు, రాణిస్తారు, దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తారని ఈ విజయాలన్నీ నిరూపిస్తున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల పనులు ఇకపై ఎస్‌ఎంసీలకే...

- మొదటి పేజి తరువాయి

మౌలిక సదుపాయాలకు సంబంధించిన చిన్న పనులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు అప్పగించి వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఉన్నతాధికారులతో అమరావతిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 3 స్టార్ మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెయ్యి మందికి పైగా విద్యార్థులున్న 60 పాఠశాలల్లో 5 స్టార్ సౌకర్యాలు ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలన్నారు. లీక్ ప్రూఫ్ భవనాలు, తాగునీరు, టాయిలెట్లు, పెయింటింగ్ వంటి పనులను ఎస్‌ఎంసీలకే అప్పగించాలని సూచించారు. అయితే, మోడల్ ప్రైమరీ స్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను మాత్రం రాష్ట్ర పాఠశాల మౌలిక సదుపాయాల సంస్థ ద్వారానే చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని లోకేష్ ఆదేశించారు. ఇందుకోసం 'డోర్ టు డోర్' క్యాంపెయిన్ నిర్వహించాలని, ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ ఏడాది 10 శాతం అడ్మిషన్ల పెరుగుదలను లక్ష్యంగా పెట్టుకోవాలని, డ్రాపవుట్లను సున్నా స్థాయికి తీసుకురావాలని స్పష్టం చేశారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## విశాఖ షాప్‌లో చోరీ కేసు ఛేదన -- ఇద్దరు నిందితులు అరెస్ట్

### కేసు ఛేదన లో పోలీస్ లు సూపర్ అన్న కమిషనర్





**గాజువాక :పెన్ పవర్ ,ఏప్రిల్ 16**
విశాఖపట్నం సిటీ పరిధిలో జరిగిన షాప్ దొంగతనం కేసును దువ్వాడ క్రైమ్ పోలీసులు వేగంగా ఛేదించారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి భారీ మొత్తంలో నగదు మరియు నేరానికి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.
కేసు వివరాల పోలీస్ లు తెలిపిన వివరాలు ప్రకారం, కూర్మన్నపాలెం ప్రాంతంలో ఉన్న సచివ్ ఇన్వర్టర్స్ అండ్ బ్యాటరీ ఏజెన్సీస్ అనే షాప్‌ను నడుపుతున్న అతికంశెట్టి పైడిరాజు తన షాప్‌ను ఏప్రిల్ 9 రాత్రి వ్యాపారం ముగిసిన తరువాత షాప్ మూసివేసి ఇంటికి వెళ్లాడు అని , మరుసటి రోజు ఉదయం షాప్ తెరిచి చూడగా, పైకప్పు సిమెంట్ రేకులు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు టేబుల్ డ్రాయర్‌ను పగలగొట్టి, బ్యాంక్‌లో డిపాజిట్ చేయడానికి ఉంచిన సుమారు రూ. 2.75 లక్షల నగదును దొంగిలించినట్లు గుర్తించారని తెలిపారు . ఫిర్యాదు మేరకు పోలీసలు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాల ఆధారంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు జరిపిన పోలీసులు ఏప్రిల్ 16న నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు .
గుర్రం అఖిల్ అలియాస్ మణికంట 32సం , తాడేపల్లిగూడెం, వెస్ట్ గోదావరి జిల్లా, సవరాల భాను ప్రకాష్ 28 సం . , సత్యసాయి జిల్లా కు చెందిన వారని .
నిందితుల వద్ద నుండి రూ. 2,52,500 నగదు, స్క్రూడ్రైవర్, కటింగ్ ప్లేయర్, రెంచ్ వంటి పరికరాలను స్వాధీనం చేసుకున్నామని ,
విచారణలో నిందితులు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది. వీరిద్దరిపై వివిధ పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే పలు దొంగతనం కేసులు నమోదై ఉన్నాయని ,ఈ కేసును త్వరితగతిన ఛేదించిన దువ్వాడ క్రైమ్ పోలీసులను నగర పోలీస్ కమిషనర్ అభినందించారు.
ప్రజలు తమ ఇళ్లకు బలమైన తాళాలు వేసుకోవాలి, నగదు మరియు బంగారాన్ని ఇంట్లో ఉంచకుండా జాగ్రత్త పడాలి. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇళ్లు, షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలను నివారించవచ్చని పోలీసులు సూచించారు.

## టిడిపి అధ్యక్షుడు పల్లా కు పారిశ్రామిక ప్రాంతం లో నీరాజనాలు





**గాజువాక :పెన్ పవర్ ,ఏప్రిల్ 16**
ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా రెండోసారి పదవి బాధ్యతలు స్వీకరించి గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి విచ్చేసిన గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ని నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు ఘనంగా సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఎన్నో కష్టాలు మరియు ఇబ్బందులు వచ్చిన పట్టిన తెలుగుదేశం పార్టీ జెండా నే విడకుండా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ లోకేష్ బాబు మన్ననలు పొందిన వ్యక్తి పల్లా అని కొనియాడారు ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు ,69 వ డించార్జ్ అక్కిరెడ్డి శ్రీనివాసరావు,66వ అధ్యక్షుడు గోవాడ వాసు ,గాజువాక నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లు భవాని, 85వ అధ్యక్షుడు కర్రి దశయేంద్ర ,జిల్లా టిడిపి కన్వీనర్ కొత్తపల్లి ఉషారాణి. గాజువాక నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తమరి శివప్రసాద్ దొడ్డి సత్యరావు, 75వ టిడిపి అధ్యక్షుడు నమ్మి అప్పారావు, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు కర్ణం సత్యారావు, కార్యదర్శి సన్యాసమ్మ. వాణిజ్య విభాగం జిల్లా నాయకులు మాధవ్. గాజువాక నియోజకవర్గం అధ్యక్షుడు మురళి, 71వ కార్పొరేటర్ రాజానా రామారావు, మహిళా నాయకులు సమ్మిడి ఉమా, కాకి స్వరూప రాణి తదితరులు మరియు అధిక సంఖ్యలో నాయకులు పాలుగొన్నారు .

## చీడిగొంది గ్రామ సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం?



- 10 ఏళ్లుగా అంగన్వాడీ కోసం ఎదురు చూపులు
- శిథిలావస్థలో పాఠశాల భవనం.. పిల్లల భద్రతపై ఆందోళన



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 16:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దేవరాపల్లి గ్రామపంచాయతీకి చెందిన చీడిగొంది గ్రామంలో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా కనిపిస్తోంది. గ్రామ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు వినతులు అందజేసినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం--- చీడిగొంది గ్రామంలో అంగన్వాడీ కేంద్రం లేకపోవడం వల్ల చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలోని లక్కవరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి సుమారు 2.5 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. రోజువారీగా అంత దూరం ప్రయాణించడం చిన్నారులకు, బాలింతలకు కష్టసాధ్యమవుతోందని వాపోతున్నారు. దాదాపు 50 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో గత 10 ఏళ్లుగా అంగన్వాడీ కేంద్రం కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల గూడెం కొత్తవీధి మండలానికి మంజూరు చేసిన 57 కొత్త అంగన్వాడీ కేంద్రాల జాబితాలో తమ గ్రామం లేకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ఈ నెల 13న పాడేరు ఐటిడిఏలో నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంతికి వినతిపత్రం సమర్పించి, చీడిగొంది గ్రామంలో మినీ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేసి, టీచర్‌ను నియమించాలని కోరినట్లు గ్రామస్తుడు జి. పాపారావు తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండడం మరో ప్రధాన సమస్యగా మారింది. ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉండటంతో పిల్లలను పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారని చెప్పారు. పాఠశాలకు సంబంధించిన వంటగది నిర్మాణం సగం వరకు ఆగిపోయిందని, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాలేదని, కాంపౌండ్ గోడ లేకపోవడం, విద్యుత్, తాగునీటి సదుపాయాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పాఠశాలలో స్వీపర్ కూడా లేకపోవడం పరిస్థితిని మరింత దయనీయంగా మారుస్తోందన్నారు.
ఈ సమస్యలన్నింటినీ ఇటీవల పాడేరు ఐటిడిఏ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు, పాఠశాల భవనం నిర్మాణం సహా అన్ని సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## కిలగాడ హై స్కూలుకు పూర్వ వైభవం తీసుకొద్దాం - జెడ్పీ చైర్ పర్సన్

### పాఠశాల శత వసంతాల వేడుకల్లో జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 16.** అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలం, కిలగాడ ప్రభుత్వ హైస్కూల్ కు పూర్వ వైభవం తీసుకొచ్చే బాధ్యతను తాను తీసుకుంటానని, అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్దామని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. కిలగాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతవసంతాల వేడుకలు మూడు రోజులు పాటు నిర్వహించనున్నారు. తొలి రోజు గురువారం సుభద్ర మూర్తి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అంగరంగ వైభవంగా చేస్తున్న ఈ వేడుకల్లో సుభద్ర- మూర్తి దంపతులకు ఘన స్వాగతం లభించింది. ముందుగా సరస్వతి మాత, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులతో కలిసి దింసా నృత్యం చేశారు. ఈ సందర్భంగా సుభద్ర మూర్తి దంపతులను శతవసంతాల వేడుకల నిర్వహణ కమిటీ, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జెడ్పి చైర్ పర్సన్ సుభద్ర మాట్లాడుతూ.. కిలగాడ తనకు మెట్టినూరని, ఈ గ్రామం అంటే తనకి ఎనలేని ప్రేమ అభిమానాలు ఉంటాయని పేర్కొన్నారు. తన మామ జల్లిపల్లి కుళ్లయ్యప్ప సుదీర్ఘ కాలం పాటు ఆ స్కూల్లో వార్డెన్ గా సేవలందించిన విషయాన్ని గుర్తు చేశారు. తన కుటుంబానికి ఆ గ్రామంతో విడదీయలేని అనుబంధం తన మామయ్య ద్వారా ఏర్పడిందని చెప్పుకొచ్చారు. పాఠశాల ఎంతోమంది మేధావులను తయారు చేసిందని, ఈ పాఠశాల నుంచి వెళ్లిన చాలామంది వివిధ డిపార్ట్మెంట్లో ఉన్నత స్థాయిలో ఉన్నారని, వారందరికీ తన మామ కుళ్లయ్యప్ప వార్డెన్ గా సేవలందించిన విషయాన్ని గుర్తు చేస్తూ, పదవులతో రాజకీయాలతో సంబంధం లేకుండా గ్రామంలోనైనా పాఠశాల లోనైనా సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ ముందు ఉంటానని చెప్పారు. పాఠశాలలో ప్రహరీ లేదన్న విషయం ఇప్పటివరకు తన దృష్టికి రాలేదన్నారు. పాఠశాల అభివృద్ధి విషయంలో ఇకనుంచి తాను ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. పాఠశాలకు ఇదివరకు ఉన్న హాస్టల్ ని మళ్ళీ తీసుకొచ్చే బాధ్యతను తాను తీసుకుంటానని ఈ విషయంలో ఉన్నతాధికారులతో మాట్లాడతానని పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అల్లూరి జిల్లా ఉన్నప్పుడే ఈ పాఠశాల హాస్టల్ గురించి అప్పటి కలెక్టర్ తో ప్రత్యేకంగా చర్చించానని, ఇప్పుడు బీసీ హాస్టల్స్ వస్తున్నాయని గిరిజన ప్రాంతంలో బీసీలు ఎవరూ ఉండరు కాబట్టి పీఎం జన్ మన్ లో భాగంగా ఇక్కడ హాస్టల్ ను ఏర్పాటు చేసే బాధ్యత తీసుకుంటాను అన్నారు. నేగ్స్ లో భాగంగా ప్రహరీ నిర్మాణానికి, ఇతర ఇతర పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తనను భాగస్వామ్యం చేసినందుకు పూర్వ విద్యార్థులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

- అధికారులను ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 16 :** టెక్కలి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను కఠినంగా హెచ్చరించారు. కోటబొమ్మాలి మండలం నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం ఇరిగేషన్, రహదారులు, ఎన్.ఆర్ ఈజీఎస్, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన డీఈలు, ఏఈలు, ఇతర అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని మంత్రి సమగ్రంగా సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి గ్రామానికి రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు సమృద్ధిగా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సాగునీటి అందుబాటుపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించే పనులను వేగవంతం చేసి, నీటి సరఫరా సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు.నీటి భద్రత సాధిస్తే ఇతర రంగాల్లో అభివృద్ధి సులభమవుతుందని అన్నారు. జలమే సంపద అన్న దృక్పథంతో కాలువలు, చెరువులు, చెక్‌డ్యామ్‌లను పునరుద్ధరించి నీటి నిల్వలను పెంచే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు అవసరమైన ప్రతిపాదనలు ఉంటే ఆలస్యం చేయకుండా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూరే పనుల్లో అధికారులు చురుకుగా వ్యవహరించాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.రహదారి అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా స్పందించిన మంత్రి, పాకివలస నుంచి కొత్తపల్లి వరకు జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రహదారులు గ్రామీణ అభివృద్ధికి కీలకమని, ప్రజల రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంలో అవి ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు.తాగునీటి సమస్యల పరిష్కారంపై కూడా మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందించాలనే ప్రభుత్వ హామీని నెరవేర్చడంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణాన్ని వేగవంతం చేసి, కొళాయిల ద్వారా ప్రతి ఇంటికి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ వనరులను వినియోగించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు ఎస్ ఈ , డీఈ, ఎఈ తదితరులు పాల్గొన్నారు.

# మర్యాదపూర్వకంగా కలిసిన కాశీబుగ్గ సబ్ డివిజన్ నూతన డీఎస్పీ..



**పలాస,పెన్ పవర్ : ఏప్రిల్ 16 :**కాశీబుగ్గ సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన టి. భవాని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ, డీఎస్పీ భవాని శుభాకాంక్షలు తెలియజేసి, సబ్‌డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.అలాగే నేరాల నియంత్రణ, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

# గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ





**వజ్రపు కొత్తూరు మండలం, పెన్ పవర్ :ఏప్రిల్ 16:**వజ్రపుకొత్తూరు మండలం పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలో ప్రతిభ కనబర్చారని కళాశాల ప్రిన్సిపాల్ బి వెంకటమోహన్ అన్నారు.గురువారం గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల కు అభినందన లు తెలియజేసారు. ఈసందర్బంగా అయన మాట్లాడుతూ ద్వితీయ సంవత్సర బైపీసీ లో తులసి 858,ప్రధమ సంవత్సర లో హెచ్ఈసి లో భవాని 467,మొదటి సీఈసి లో ప్రశాంతి 415,ద్వితీయ సీఈసి లో హారిక 761,ద్వితీయ హెచ్ ఈసి లో 750 మార్కులు సాధించారాని అన్నారు. ప్రధమ, ద్వితీయ సంవత్సర ఉత్తీర్ణత 25శాతం వచ్చిందని అన్నారు. పరీక్ష లు ఫెయిల్ అయినవారికి, బెట్టర్మెంట్ రాసినవాయికి కళాశాల లో తరగతులు నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థులు కళాశాల కు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని, అలాగే పరీక్ష ఫీజు లు కూడా తీసుకుంటున్నామని అన్నారు. ఆయనతో పాటు కళాశాల అధ్యాపకులు కేశవరవు తదితరులు పాల్గున్నారు.

# ప్రజలకు ఆకర్షణీయ వడ్డీ రేట్లు అందిస్తున్న డీసీసీబీ

- వ్యక్తి పొదుపు అలవాటు- భవిష్యత్తుకు ఆర్థిక భద్రత
- డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 16 :**ప్రజలకు అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను డీసీసీబీ అందిస్తోందని విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున తెలిపారు.
విజయనగరం పట్టణానికి చెందిన ఎం. లక్ష్మి నారాయణ, చైర్మన్ నాగార్జున సమక్షంలో గురువారం విజయనగరం డీసీసీబీ బ్రాంచ్‌లో ఫిక్స్డ్ డిపాజిట్ రూపంలో రూ. 5,10,000/- జమ చేశారు.
ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, డీసీసీబీ ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తూ ఆర్థికంగా బలంగా ఎదుగుతోందన్నారు. ఖాతాదారులకు భద్రతతో కూడిన సేవలు, ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు అందిస్తున్నామని తెలిపారు.
గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబం పొదుపు అలవాటు పెంపొందించుకొని భవిష్యత్తు కోసం ఆర్థిక భద్రతను సాధించాలని సూచించారు.
డిపాజిట్లు పెరగడం ద్వారా బ్యాంకు మరింత బలోపేతం అవుతుందని, తద్వారా ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని చెప్పారు.
లక్ష్మి నారాయణ మాట్లాడుతూ, డీసీసీబీపై నమ్మకంతోనే ఈ ఫిక్స్డ్ డిపాజిట్ చేసినట్లు తెలిపారు.
ప్రతి ఒక్కరూ పొదుపు చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎ వి న్ రాజు, సుజాత, తేజ పాల్గొన్నారు.

# జోన్-2గా అల్లూరి జిల్లా గిరిజన భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు

ప్రత్యేక కథనం:

- ఉద్యోగాల్లో స్థానికత గల్లంతు,
- గిరిజన ఉద్యోగుల సంఘం
- మరియు గిరిజన యువత ఆందోళన



**పాడేరు, పెన్ పవర్, ఏప్రిల్ 16:** రాష్ట్ర ప్రభుత్వం 2025లో అమలులోకి తెచ్చిన కొత్త జోనల్ వ్యవస్థతో అల్లూరి సీతారామరాజు జిల్లా జోన్-1 నుంచి జోన్-2గా మారింది. ఈ మార్పు గిరిజన ప్రాంతంపై పిడుగుపాటులా పడిందని గిరిజన సంఘాలు, ప్రజా నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఎప్పుడు మార్చారు:
2025లో రాష్ట్ర మంత్రివర్గం 26 జిల్లాల ప్రాతిపదికన కొత్తగా 6 జోన్ల వ్యవస్థకు ఆమోదం తెలిపింది. గతంలో ఉమ్మడి 13 జిల్లాల లెక్కన జోన్-1లో ఉన్న అల్లూరి జిల్లా, ఇప్పుడు జోన్-2 పరిధిలోకి చేరింది. జోన్-2లో అల్లూరితో పాటు పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు ఉన్నాయి.
గిరిజనులకు వాటిల్లుతున్న నష్టాలు:
ఉద్యోగాల్లో స్థానికత కరిగిపోతోంది ఉద్యోగ నియామకాల్లో 95 శాతం స్థానిక కోటా జోన్ ప్రాతిపదికన అమలవుతుంది. గతంలో జోన్-1లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల అభ్యర్థులతో మాత్రమే పోటీ ఉండేది. ఇప్పుడు జోన్-2 పరిధిలోకి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలు రావడంతో పోటీ 4 రెట్లు పెరిగింది. జోన్-2 మొత్తం జనాభా 2.5 కోట్లకు పైగా ఉండగా అల్లూరి జిల్లా వాటా 4 శాతం కూడా లేదు. దీంతో ఏజెన్సీ బిడ్డలకు ఉద్యోగం దొరకడం కలగా మారింది.
ఐదో షెడ్యూలుకు తూట్లు:లి రాజ్యాంగంలోని ఐదో షెడ్యూలు, ఒకటి వరుస డెబ్బై చట్టం ప్రకారం ఏజెన్సీ ఉద్యోగాలు గిరిజనులకే దక్కాలి. జోన్ మార్పుతో ఈ రక్షణ కరిగిపోయింది. 'పాడేరులో పుట్టిన గిరిజన బిడ్డ, గుంటూరులో పుట్టిన వ్యక్తి ఇద్దరూ జోన్-2 స్థానికులే' అనే పరిస్థితి వచ్చింది. దీంతో గిరిజనేతరులు ఏజెన్సీ ఉద్యోగాలను ఆక్రమిస్తున్నారు.
. గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయా?:లి పేరుకు ఉన్నాయి, వాస్తవంలో లేవు అని నిరుద్యోగులు వాపోతున్నారు. ఏజెన్సీలో విద్యా సౌకర్యాలు, శిక్షణ కేంద్రాలు తక్కువ. మైదాన ప్రాంతం నుంచి కోచింగ్ తీసుకున్న అభ్యర్థులతో పోటీ పడి గిరిజన యువత నెగ్గడం అసాధ్యం. ఇప్పటికే జిల్లాలోని అనేక ప్రభుత్వ శాఖల్లో గిరిజనేతర ఉద్యోగులే 70 శాతం ఉన్నారు. జోన్-2తో ఈ సంఖ్య 90 శాతం దాటుతుందని అంచనా.
గిరిజన సంఘాలు, ప్రజా నాయకుల అభిప్రాయం:
"ఇది గిరిజనుల ఉనికికే ప్రమాదం. మా కొండల్లో, మా భూముల్లో మాకే ఉద్యోగం లేకుండా చేస్తున్నారు. వెంటనే ఏజెన్సీ ప్రాంతాన్ని ప్రత్యేక జోన్‌గా ప్రకటించాలి. లేదంటే ఏజెన్సీ ఉద్యోగాలను నూటికి నూరు శాతం స్థానిక గిరిజనులకే కేటాయించేలా ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వాలి" అని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.
"జోన్ మార్పు ఉద్యోగులకు బదిలీల్లో లాభం చేకూర్చినా, నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది. గిరిజన బిడ్డల భవిష్యత్తును ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోలేదు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి" అని స్థానిక ప్రజా నాయకులు మండిపడుతున్నారు.
ఉద్యోగులకు నష్టమా లాభమా?:
పనిచేస్తున్న ఉద్యోగులకు జోన్-2తో బదిలీ అవకాశాలు పెరిగాయి. గతంలో 3 జిల్లాలకు పరిమితమైన బదిలీలు ఇప్పుడు 6 జిల్లాలకు విస్తరించాయి. పదోన్నతుల్లో కూడా కొంత వెసులుబాటు ఉంది. కానీ కొత్తగా ఉద్యోగంలోకి వచ్చే గిరిజన యువతకు మాత్రం ఇది పూర్తిగా నష్టమేనని ఉద్యోగ సంఘాల నాయకులే అంగీకరిస్తున్నారు. "మాకు లాభం జరిగితే మా పిల్లలకు నష్టం జరుగుతోంది" అని వారు ఆవేదన చెందుతున్నారు.
ప్రభుత్వం స్పందించి ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలకు రక్షణ కల్పించకుంటే గిరిజన యువత ఉద్యమ బాట పడుతుందని తెలిపారు.

# పాడేరులో చట్టాలకు సమాధి.. అధికారుల జేబుల్లో ముడుపుల వాన..!

## 1/70 చట్టాన్ని ఖూనీ చేసి గిరిజన హక్కులకు గొయ్యి తీస్తున్న వైనం



**పాడేరు, పెన్ పవర్, ఏప్రిల్ 16:**అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో అక్రమ నిర్మాణాల జోరు 'ఏరు'లై పారుతోంది. చట్టాన్ని కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు 'కాపలా కుక్కలు'గా మారడం ఇక్కడి దుస్థితి.
"ముడుపులు ఇచ్చుకో.. మేడలు కట్టుకో'':
రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారుల తీరు చూస్తే ఇదే నినాదం వినిపిస్తోంది. ఐదవ షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరులు శాశ్వత కట్టడాలు కట్టకూడదని రాజ్యాంగం ఘోషిస్తున్నా, ఇక్కడి అధికారులకు మాత్రం కరెన్సీ కట్టల చప్పుడే వేదమైంది. గిరిజన చట్టాలను కాలితో తన్ని, నోట్ల కట్టలకు సలాం కొడుతున్నారు. అధికారుల కళ్లు 'నోట్ల'తోనే మూసుకుపోయాయా అని గిరిజన మేధావులు మండిపడుతున్నారు.
కలెక్టరేట్ ముందే కబ్జా.. అధికారులకు కనిపించదా?:
జిల్లా కేంద్రంలో భారీ బహుళ అంతస్తుల భవనాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా, ఐటీడీఏ పెద్దలకు మాత్రం కనులు మూసుకుపోయాయా? పేద గిరిజనుడు తల దాచుకోవడానికి చిన్న రేకుల షెడ్డు వేస్తే జేసీబీలతో దాడి చేసే అధికారులు, కోట్లు కుమ్మరించి గిరిజనేతరులు కడుతున్న మేడల దగ్గరకు వెళ్లడానికి ఎందుకు గజగజ వణుకుతున్నారు? అక్కడ కనిపిస్తున్నవి భవనాలు కావు.. అధికారుల అవినీతికి నిలువెత్తు సాక్ష్యాలు అని ప్రజలు బహిరంగంగానే ఛీకొడుతున్నారు.
చట్టం చుట్టైంది.. ముడుపులే మంత్రమైంది:
1/70 భూ బదలాయింపు చట్టం పాడేరు నడిబొడ్డున నవ్వులపాలవుతోంది. అధికారుల జేబులో మామూళ్లు పడితే చాలు, వాళ్ల నోటికి తాళం పడుతోంది. గిరిజన హక్కులను కాపాడాల్సిన వాళ్లే, ఆ హక్కులను తొక్కేస్తున్న దళారులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. చట్టాన్ని బేఖాతరు చేసి, అధికారులను 'సెట్' చేసుకున్నాం అనే ధీమాతో లేస్తున్న ప్రతి ఇటుకపై గిరిజన ద్రోహం ముద్ర పడి ఉంది.
ప్రజల డిమాండ్ – కూల్చివేతే శరణ్యం:
గిరిజన చట్టాలను అపహాస్యం చేస్తూ కడుతున్న ఈ అవినీతి కోటలు ఎంతో కాలం నిలవవు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి, క్షేత్రస్థాయిలో మెరుపు విచారణ చేపట్టాలి. ఈ అక్రమ కట్టడాలకు సహకరించిన ప్రతి అధికారిని వెంటనే సస్పెండ్ చేసి, ఆ భవనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.
కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే అక్రమాలు.. మౌనం ఎందుకు?:
చట్టాన్ని అమలు చేయాల్సిన కలెక్టరేట్ ముక్కుసూటి ఎదురుగానే అక్రమ కట్టడాలు జరుగుతుంటే యంత్రాంగం చోద్యం చూస్తోంది ఎందుకు? అవినీతి అధికారుల అంతు చూసేది ఎప్పుడు? గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరుల పెత్తనానికి చట్టబద్ధత కల్పిస్తున్నారా అని గిరిజన మేధావులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.
ఇప్పటికైనా ప్రభుత్వం నిద్ర లేవాలి. పాడేరు గడ్డపై రాజ్యమేలుతున్న ఈ అక్రమ సామ్రాజ్యాన్ని కూల్చిపడేసి, గిరిజన హక్కుల సత్తా ఏంటో చాటిచెప్పాలని గిరిజన ప్రజలు, మేధావులు, సంఘాలు గర్జిస్తున్నాయి.

# టీబీ నిర్మూలన లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యం అవసరం

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 16:** దేశాన్ని టీబీ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. టిబి ముక్తి భారత్ అభియాన్ 2.0 టీబీఎంబీఏ కార్యక్రమంలో భాగంగా శివాజీపాలెం క్యాంప్ కార్యాలయంలో గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, టీబీ వ్యాధి లక్షణాలపై ప్రజల్లో అవగాహన పెంచు కోవడం అత్యంత కీలకమని అన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, రాత్రిపూట చెమటలు పట్టడం, అలసట, కఫంలో రక్తపు చారులు వం టి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవా లని సూచించారు.ప్రత్యేకంగా ధూమపానం చేసే వారు, 60 సంవత్సరాల పైబడిన వారు, డయా బెటిస్ బాధితులు, గతంలో టీబీ సోకిన వారు, బాడీ మాస్ ఇండెక్స్18 కంటే తక్కువగా ఉన్న వారు తప్పనిసరిగా కఫం పరీక్షలు, ఛాతీ ఎక్స్ రేలు చేయించుకోవాలని తెలిపారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తిస్తే పూర్తిగా నయం చేసు కోవచ్చని ఆయన స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ రోణంకి రమేష్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# చదువుకున్న బడికి సౌండ్ సిస్టం బహుకరించిన పూర్వ విద్యార్థులు



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 16 :** సంతబొమ్మాళి మండలం గొదలాం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈగల శ్రీనివాసరావు, పాలిన మల్లయ్య, పాలిన హరికృష్ణ లు గురువారం పాఠశాలకు తమ వంతుగా సౌండ్ సిస్టం బహూకరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఇంకా ఏమైనా సహాయ సహకారాలు కావాలంటే తమ వంతుగా అందజేస్తామని తెలిపారు. గ్రామంలో పుట్టి పాఠశాలలో చదువుకొని గ్రామస్తుల ఆశీర్వాదం, దేవుని దయతో ప్రస్తుతం ఉన్నత స్థానంలో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు ఉపాధ్యాయ సిబ్బంది, సహచరులు అభినందించారు.

# మర్యాదపూర్వక కలయిక...!



**పలాస, పెన్ పవర్ : ఏప్రిల్ 16:**తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గా నియమితులైన ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు నేడు మాజీ మంత్రి వర్యులు శ్రీ గౌతు శ్యాంసుందర్ శివాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పలాస పట్టణ తెలుగుదేశం కార్యదర్శి సప్ప నవీన్,డొక్కరి శంకర్, కొరికాన శంకర్ రావు, సాసుమాన సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

# గర్భాం ఎర్ర చెరువు పై మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవం ... టిడిపి నేతలు



**పెన్ పవర్ చీపురుపల్లి ఏప్రిల్ 16.** మెరకముడిదాం మండలం గర్భాం ఎర్రచెరువు ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కనుసన్నల్లో ఆక్రమణకు గురాయ్యిందన్న మీడియాలో ప్రచురించిన కధనంలో వాస్తవం లేదని మండల తెలుగుదేశం నేతలు ఖండించారు. గురువారం గర్భాం లో ఏ ఎం సి అధ్యక్షులు తాడ్డి చంద్రశేఖర్ నివాసంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన విలేఖరల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ బి ఆర్ కె న్యూస్ ఛానెల్ లో ఎమ్మెల్యే కళావేంకటరావు తెలిసే ఆక్రమణలు జరిగాయి అనడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. తప్పుడు వార్తలు ప్రచారం చేసిన చేనల్ పై పరువు నష్టం దావ వేయుటకు సిద్ధపడునట్లు తెలిపారు. ఈ చెరువు విస్తీర్ణం ఎంత దుకాణాలు ఎక్కడ ఉన్నాయో తెలిసికోకుండా వార్త ప్రచారం చేయడం సమాంజసం కాదని అయన తెలిపారు. ఆర్ అండ్ బి రోడ్డుకు అనుకుని దుఃఖానాలు నిర్మించుకుని సుమారు 25 ఏళ్ళు అవుతుందని కళావెంకటరావు ఈ నియోజకవర్గం ఎమ్మెల్యే బాధ్యతులు చేపట్టి రెండు ఏళ్ళు కూడా పూర్తి కాలేదని వార్త ప్రచారం చేసేముందు ఆలోచించాలని అయన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎం పి పి కోట్ల మోతిలాల్ నాయుడు మాట్లాడుతూ ఎర్రచెరువు సుమారు 26 ఎకరాలు విస్తీర్ణం ఉండగా అందులో రోడ్డు నిర్మాణంకు సుమారు 5 ఎకరాలు పొగా ఉన్న 20 ఎకరాల్లో 100 ఎకరాలు ఎలా ఆక్రమించుకుంటారని ప్రశ్నించారు. ఆర్ అండ్ బి స్థలంలో షాప్స్ 25 ఏళ్ల క్రితం నిర్మించుకుంటే ఇప్పుడు ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కనుసన్నల్లో ఆక్రమణ జరిగింది అనడం హాస్యాస్పదం అన్నారు. తప్పుడు వార్తలు ప్రచారం చేసి పత్రికలు, చానళ్ళు వారి విలువలు దిగజార్చారాదని తెలిపారు. తాడ్డి చంద్రశేఖర్ మాట్లాడుతూ మా చిన్నతనం నుండి రోడ్డుకు ఇరువైపుల దుఃఖానాలు ఉన్నాయని ఇప్పుడు ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావుకు తెలిసి ఆక్రమణలు జరగడమేంటి అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తాడ్డి శ్రీధర్, పిన్నింటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం ఆటలు

**వై.సి.పి.విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు తీవ్ర విమర్శలు**


**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 16 :** ఆంధ్రప్రదేశ్‌లో యువత భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైఎ స్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలులో విఫ లమవడంతో యువతలో నిరాశ పెరిగిందని ఆయన పేర్కొన్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు ఉరుకూటి రామచంద్రరావు, రాష్ట్ర విద్యార్థి కార్యనిర్వాహక అధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ఆధ్వర్యంలో యువజన, విద్యార్థి విభాగాల ముఖ్య నాయకుల సమావేశం జరిగిం ది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కె.కె. రాజు ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై విమర్శ లు గుప్పించారు.ఆయన మాట్లాడుతూ, ఉద్యో గాల పేరుతో భారీ హామీలు ఇచ్చిన ప్రభుత్వం వాటి అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. నోటిఫికేషన్ల విడుదలలో ఆలస్యం, ఖాళీ పోస్టు లను భర్తీ చేయడంలో నిర్లక్ష్యం కారణంగా లక్ష లాది మంది యువత నిరుద్యోగులుగా మిగిలి పోయారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు కూడా ఆశించిన ఫలితాలు ఇవ్వలేక పోయాయని, పరిశ్రమలు రాకపోవడంతో ఉపా ధి అవకాశాలు తగ్గాయని పేర్కొన్నారు. ఈ పరి స్థితుల వల్ల యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యారంగంపై కూడా ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో ఆలస్యం, స్కాలర్‌షిప్‌ల లో జాప్యం, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయా ల లోపం వంటి సమస్యలు విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలోనే ఆపాల్సి



వస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని, స్కాలర్‌షిప్‌లను సమయానికి అందించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యారంగంలో స్థిరత్వం తీసుకురావడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తును రక్షించాలని సూచించారు.

ఈ సమావేశంలో యువజన విభాగం జోనల్ అధ్యక్షుడు అంబటి శైలేష్‌తో పాటు జగ్గుపల్లి నరేష్, దీరాజ్ రెడ్డి, హరీష్, చంద్రమౌలి, నాగిరెడ్డి కిరణ్, తాడి రవితేజ, రవికిరణ్ రెడ్డి, తులసి కుమార్, రోహిత్, నితిష్, రౌత్ శ్రీను, మీసాల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.




## హైకోర్టు సీజే పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 16 :** జిల్లా కలెక్టర్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పర్యటన నేపథ్యంలో ఎలాంటి లోపా లు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.ఏప్రిల్ 17, 18 తేదీలలో విశాఖపట్నం లో జరగనున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటనపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల నిర్వహణలో అన్ని విభాగాల అధి కారులు పరస్పర సమన్వయంతో పనిచేయాల ని, సందర్శనలో ఎలాంటి అసౌకర్యం కలగకుం డా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. 17వ తేదీ రాత్రికి ప్రధాన న్యాయ మూర్తి నగరానికి చేరుకోగా, 18వ తేదీ ఉదయం నుంచి వివిధ కార్యక్రమాలలో పాల్గొననున్నారు. పర్యటనలో భాగంగా ఎండాడ పరిధిలోని రుషి కొండ ప్రాంతంలో ఇస్కాన్ టెంపుల్ వెనుక భా గంలో నిర్మించనున్న జ్యూడీషియల్ గెస్ట్ హౌస్ కు ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన కార్య క్రమం జరగనుంది.ఈ కార్యక్రమం విజయ వంతానికి జిల్లా యంత్రాంగం, న్యాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్, భద్రత, బందో బస్తు, ట్రాఫిక్ నిర్వహణ, వసతి వంటి అంశాల లో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

సమీక్ష సమావేశంలో ఫస్ట్ ఏడీజే ఎం. వెంకట రమణ, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి అండగా టీడీపీ భీమా పథకం

**జగన్నాథ రావు కుటుంబానికి రూ.5 లక్షల భీమా చెక్కు అందజేత**

**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 16 :** కోటబొమ్మాళి మండలం కన్నెవలస గ్రామానికి చెందిన రావాడ జగన్నాథరావు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలోకి వెళ్లింది. అంతకుముందు తెలుగుదేశం పార్టీలో కేవలం రూ.100తో సభ్యత్వం తీసుకున్నాడు. ఆ బాధలో ఉన్న ఆ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలిచింది. పార్టీ సభ్యత్వం ద్వారా లభించిన భీమా పథకం కింద బాధిత కుటుంబానికి గురువారం రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని, తక్షణమే భీమా క్లెయిమ్ మంజూరయ్యేలా చర్యలు చేపట్టి, కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు. నిమ్మాడలో జరిగిన కార్యక్రమంలో మంత్రి చేతుల మీదుగా రూ.5 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ సభ్యుడిని కోల్పోయిన ఆ కుటుంబానికి ఇది ఒక చిన్న ఆర్థిక ఊరటగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కార్యకర్తలు, సభ్యుల కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవడమే టీడీపీ భీమా పథకం లక్ష్యం అని అన్నారు. చిన్న సభ్యత్వంతోనూ పెద్ద స్థాయి భద్రత కల్పించడం ఈ పథకం ప్రత్యేకత అని తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, పార్టీ అండతో తమకు ధైర్యం లభించిందని కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. కష్ట సమయంలో ప్రభుత్వం, పార్టీ కలిసి అండగా నిలవడం తమకు పెద్ద భరోసా ఇచ్చిందని వారు తెలిపారు.



కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కోమటి కార్పోరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన సత్యశ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పలాసలో మిన్నంటిన టీడీపీ సంబరాలు: నారా లోకేష్ నియామకంపై హర్షాతిరేకం....



**పలాస:పెన్ పవర్ : ఏప్రిల్ 16:**తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని, పలాస మండల టీడీపీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. లోకేష్ నాయకత్వం పార్టీకి మరింత ఊపునిస్తుందని ఆకాంక్షిస్తూ, మండల కేంద్రంలో నాయకులంతా కలిసి భారీ కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు సముచిత స్థానం కల్పించడం పట్ల పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల నియోజకవర్గ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న కింజరాపు కుటుంబానికి



తగిన గౌరవశీ బాధ్యతలు అప్పగించడం పట్ల కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

విజయకేతనం దిశగా అడుగులు

రాష్ట్ర కమిటీలో పలాస నియోజకవర్గానికి జిల్లా నేతలకు లభించిన ప్రాధాన్యతతో రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి. విఠల్ , వి కుర్మా రావు, డి సంతోష్,టి గంగారాం ,యాదగిరి, కుత్తుం ప్రకాష్,బి.రాజు, నాయుడు , మండల స్థాయి ముఖ్య నేతలు, పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.

## గిరిజన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయండి. సిదరి రామూర్తి

**కలెక్టర్ ను మరియు పిఓ లను మర్యాదపూర్వకంగా కలిసిన సిదరి రామ్మూర్తి**





**హుకుంపేట ఏప్రిల్ పెన్ పవర్ 16 :**అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కలెక్టర్ శ్రీమతి నిశాంతి ఐఏఎస్ ని, అలాగే పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి (పి .ఓ )క్రొత్తగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ ఆదిత్య వర్మ ఐఏఎస్ ని జనసేన పార్టీ నాయకులు, మాజీ గ్రూప్-1 అధికారి సీదరి రామమూర్తి మర్యాదపూర్వకంగా కలిసి

అల్లూరి జిల్లా ను జోన్ -1 లో ఉండటానికి మీ వంతు కృషి చేయాలనీ కలెక్టర్ మరియు ఐ.టీ.డీ.ఎ పిఓ ని వినతి పత్రం ఇచ్చి కోరడమైనది

ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గిరిజన ప్రాంత అభివృద్ధి, స్థానిక సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై కలెక్టర్ మరియు ఐటిడిఎ పీఓ తో సీదరి రామమూర్తి చర్చించడం .జరిగింది

## రేవిడి హై స్కూల్లో క్రైమ్ అవేర్నెస్ ప్రోగ్రాం



**పద్మనాభం, పెన్ పవర్, ఏప్రిల్ 16 :**పద్మనాభం మండలంలోని ఆర్.వి.పురం జిల్లా పరిషత్ హై స్కూల్ లో గురువారం పద్మనాభం క్రైమ్ ఎస్సై జి వెంకటరావు ఆధ్వర్యంలో విద్యా ర్థులకు క్రైమ్ అవేర్నెస్ ప్రోగ్రాం ని ఏర్పాటు చేశా రు ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఈ దశలోనే చదువుకునే అవకాశం ఉందని ఈ సమయంలో ఎటువంటి తప్పుడు పనులు తప్పుడు నిర్ణయా లు తీసుకోకుండా మంచి బాట వైపు మంచి ఆలోచనతో బాగా చదువుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు లు వి శంకర్రావు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాడేరులో ఈ నెల 22న జిల్లా స్థాయి బాక్సింగ్, ఫుట్‌బాల్ పోటీలు

- **21 ఏళ్ల లోపు యువతకు అవకాశం.. విజేతలకు రాష్ట్ర స్థాయి బాట**

**పాడేరు,పెన్ పవర్, ఏప్రిల్ 16:**ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా మెగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సీతారామ రాజు జిల్లాలో ఈ నెల 22వ తేదీన జిల్లా స్థాయి బాక్సింగ్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎ. జగన్మోహనరావు తెలిపారు.

ఈ పోటీలు 22 ఏప్రిల్ 2026న ఉదయం 10:00 గంటలకు పాడేరులోని జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 21 సంవత్సరాల లోపు వయస్సు గల బాలురు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులని వెల్లడించారు.

జిల్లా స్థాయిలో బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు ఈ నెల 28 నుంచి 30 వరకు విశాఖపట్నం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు, ఫుట్‌బాల్ పోటీల్లో గెలుపొందిన వారు ఈ నెల 28 నుంచి 30 వరకు అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికవుతారని వివరించారు.

ఈ క్రీడా పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తప్పనిసరిగా ష్ట్రజూం://ంజూశీతీం.ఖజూ.స్త్రశీఙ.ఱఅ/ఎ/తీవస్త్రఱర్‌తీష్‌ఱశీఅ /ఋజూ-శ్రీముస్త్రబవ-తీవస్త్రఱర్‌తీష్‌ఱశీఅ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపికలో పాల్గొనదలచిన వారు యూజర్ల జిరాక్స్ పత్రాలు కలిగి ఉండాలని కోరారు. మరిన్ని వివరాలకు 6303193400, 9000274225 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 16 :** కోటబొమ్మాళి మండలం జాతీయ రహదారి పాకివలస గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మండలం పొన్నాడ పేట గ్రామానికి చెందిన ముద్దాడ మురళి (38) మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు మృతుడు మురళి తన ద్విచక్రవాహనంపై కూరగాయాలు విక్రయించేందుకు శ్రీపురం కూరగాయల మార్కెట్‌కు వెళ్లాడు. విక్రయించుకుని తిరిగి వస్తుండగా పాకివలస జంక్షన్ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి లారీ ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మురళి అక్కడకక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్థంకోసం తరలించి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ సత్యన్నారాయణ తెలిపారు. కాగా మృతుడికి భార్య లక్ష్మి, కుమారులు అసిరిత్, కిరణ్‌లు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి తో కుటుంబం రోడ్డున పడిందని గ్రామస్థులు తెలిపారు.

# మోదకొండమ్మ జాతర తేదీలపై రాజకీయ కక్ష సాధింపు ఆరోపణలు

- మోదకొండమ్మ జాతర వాయిదా.. కక్ష సాధింపేనా?
- జాతర తేదీల మార్పు.. రాజకీయ రంగు పులుముకుంటోందా?



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 16:** గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవ తేదీల విషయంలో కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపునకు దిగిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి, దామనపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ కే. రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మోదకొండమ్మ తల్లి పుట్టినరోజు సందర్భంగా జాతర మహోత్సవ తేదీలను ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, గిరిజన పెద్దలు, మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పరస్పర చర్చల ద్వారా ఖరారు చేస్తారని చెప్పారు. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ సంవత్సరం కూడా తేదీలు నిర్ణయించినప్పటికీ, గిరిజన మంత్రి సంధ్యారాణి ఏకపక్ష నిర్ణయం తీసుకొని జాతరను వాయిదా వేయడం గిరిజనుల మనోభావాలను దెబ్బతీసిందని విమర్శించారు.గిరిజన సంప్రదాయాలను అవమానించే విధంగా మంత్రి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, పాడేరు ఎమ్మెల్యే మత్యారాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఆలయ కమిటీని పక్కన పెట్టడం సరైంది కాదన్నారు. రెండు నెలల ముందే తేదీలు ఖరారైనప్పటికీ అప్పట్లో అభ్యంతరం వ్యక్తం చేయని ప్రభుత్వం, పండుగకు కేవలం 20 రోజులు మాత్రమే మిగిలి ఉన్న సమయంలో నిర్ణయం మార్చడం వెనుక రాజకీయ ప్రయోజనాలే ఉన్నాయని ఆరోపించారు.ప్రజా సమస్యలను పక్కన పెట్టి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు దేవాలయాల వ్యవహారాల్లో కూడా జోక్యం చేసుకోవడం సమంజసం కాదన్నారు. గిరిజన ఆచారాలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలతో పాటు అమ్మవారి ఆగ్రహాన్నీ ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఇప్పటికైనా ఆలయ కమిటీ నిర్ణయించిన తేదీల ప్రకారమే మోదకొండమ్మ మహోత్సవాలు నిర్వహించాలని, లేని పక్షంలో ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని రామకృష్ణ స్పష్టం చేశారు.

## నర్సీపట్నంలో అత్యాధునిక అగ్నిమాపక వాహనం ప్రారంభం




**నర్సీపట్నం, పెన్ పవర్ (ఏప్రెల్ 16) :** స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నూతన అగ్నిమాపక వాహనాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి చింతకాయల పద్మావతి, డిసిసిబి చైర్మన్ కొన తాతారావు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం రూరల్ ఏజెన్సీ ప్రాంతం చాలా పెద్దదని, గతంలో ఇక్కడ పూరి గుడిసెలు, ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కడ అగ్నిప్రమాదం జరిగినా భారీ ఆస్తి నష్టం సంభవించేదని ఆయన గుర్తు చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం ఫైర్ స్టేషన్ల అభివృద్ధికి కృషి చేస్తున్నాయని తెలిపారు. నర్సీపట్నం కేంద్రంగా అటు సీలేరు నుంచి ఇటు ఏజెన్సీ ప్రాంతమైన రావికమతం వరకు సుమారు 71 కిలోమీటర్ల పరిధిని ఈ ఒక్క స్టేషన్ కవర్ చేయాల్సి వస్తోందని, పాత వాహనాలు కండిషన్ లో లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

?అందుకే అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఈ కొత్త బండిని ప్రభుత్వం మంజూరు చేయడం సంతోషదాయకమని అయ్యన్నపాత్రుడు అన్నారు. అయితే ఈ ప్రాంత విస్తీర్ణం దృష్ట్యా ఇక్కడ కనీసం రెండు ఫైర్ ఇంజన్లు ఉండాల్సిన అవసరం ఉందని, త్వరలోనే మరో కొత్త వాహనాన్ని కూడా తెప్పించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. రెండు వాహనాలు అందుబాటులో ఉంటే సుమారు 30 మంది సిబ్బందితో అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను అరికట్టవచ్చని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పంట కోతల సమయంలో పొలాల్లో జరిగే అగ్నిప్రమాదాల నుంచి రైతులకు ఊరట లభిస్తుందని చెప్పారు. ఈ వాహనం మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, హోం మంత్రి గారికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

?ఈ కార్యక్రమంలో జనసేన నర్సీపట్నం ఇంచార్జ్ సూర్యచంద్ర, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ఆదిలక్ష్మి, నర్సీపట్నం టిడిపి ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ, వెలగా కృష్ణారావు, టిడిపి మున్సిపాలిటీ నాయకులు మరియు అగ్నిమాపక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారి జయ నాగలక్ష్మి కలిసిన కూటమి నాయకులు.



**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 16.** అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం కొమ్మంగి పంచాయతీ ప్రత్యేక అధికారిగా నియమితులైన ఏ టి డబ్ల్యూ ఓ బి. జయ నాగలక్ష్మి నీ కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలిసిన కూటమి నాయకులు పంచాయతీ పరిధిలోని వివిధ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపించే విధంగా తాను కృషి చేస్తానని జయ నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు ఆమెకు దుస్సాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ గ్రామ అధ్యక్షులు వంతల లక్ష్మణ్, యూనిట్ ఇంచార్జ్ పుటుకూరు సుదర్శన్ ప్రధాన కార్యదర్శి చల్లంగి సురేష్ బాబు, జనసేన నాయకులు గసాడి దిలీప్, తెలుగుదేశం పార్టీ గ్రామ కార్యదర్శి లక్క లింగేష్, పంచాయితీ సెక్రటరీ పైడిరాజు సచివాల సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాల పంపిణీ వేగవంతం చేయాలి

-రెవెన్యూ శాఖ అధికారులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశం



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 16:** రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఇళ్ల పట్టాల పంపిణీ వేగవంతం చేయాలని, 2029 నాటికి ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా కోట బొమ్మాలి మండలం నిమ్మాడ లోని తన క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ శాఖ అధికారులతో గురువారం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని పూచించారు, కోటబొమ్మాళి మండలం భవానిపురం గ్రామానికి చెందిన పేద లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదల జీవితాల్లో స్థిరత్వం తీసుకురావడంలో గృహ నిర్మాణం కీలకమని అన్నారు. ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వంపై తీవ్రంగా స్పందించిన మంత్రి, పేదల సొంతింటి కలను గత పాలకులు ఛిద్రము చేశారని విమర్శించారు. లబ్ధిదారులకు చెల్లించాల్సిన సుమారు రూ.900 కోట్ల బకాయిలను పెండింగ్‌లో ఉంచడం ద్వారా గృహ నిర్మాణ రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. ఆ బకాయిలన్నింటినీ చెల్లించే బాధ్యతను కూటమి ప్రభుత్వం స్వీకరించిందని స్పష్టం చేశారు. అలాగే, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి తెలిపారు. ఇకపై అలాంటి పరిస్థితులు రాకుండా సమగ్ర ప్రణాళికతో గృహ నిర్మాణ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. "ఇది పేదల ప్రభుత్వం" అని స్పష్టం చేసిన మంత్రి, పేదలకు న్యాయం చేయడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ముఖ్య బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి పారదర్శకంగా, వేగవంతంగా ఇళ్లను అందించడంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. ఈ సమావేశంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, నాలుగు మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

స్వీయ గణనను నమోదు చేసుకున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు : జనగణన-2027లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వీయ గణన' ప్రక్రియను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించారు. గురువారం శ్రీకాకుళం జిల్లాలోని తన నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో పోర్టల్ ద్వారా ఆయన తన వివరాలను స్వయంగా నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలిచే జనగణన ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టెక్నాలజీని ఉపయోగించుకుంటూ ఇంటి నుండే సులభంగా వివరాలు నమోదు చేసుకునే ఈ వెసులుబాటును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డీవో ఎన్ . క్రిష్ణమూర్తి , మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ కవచ్ ఎక్సర్సైజ్-1/2026 విజయవంతం

### తీర భద్రతకు బలమైన కవచం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 16 :**ఆంధ్రప్రదేశ్ సముద్ర తీర భద్రతను మరింత పటిష్టం చేయడానికి మెరైన్ పోలీస్, కోస్ట్ గార్డు, నేవీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'సాగర్ కవచ్ ఎక్సర్సైజ్-1/2026' విజయవం తంగా ముగిసింది. ఏప్రిల్ 14, 15 తేదీలలో రెం డు రోజులపాటు జరిగిన ఈ విస్తృత స్థాయి వ్యాయామంలో రాష్ట్రంలోని భద్రతా యంత్రాం గం సమన్వయంతో పనిచేసింది.శ్రీకాకుళం జిల్లా బారువ నుండి తిరుపతి జిల్లా శ్రీహరికోట వరకు సుమారు 1054 కిలోమీటర్ల మేర ఆంధ్రప్రదేశ్ సాగర తీరాన్ని కవర్ చేస్తూ ఈ ఎక్సర్సైజ్ నిర్వ హించారు. మొత్తం 1750 మంది పోలీస్ అధికా రులు, సిబ్బంది పాల్గొని తీర భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు.ఈ కోస్టల్ సెక్యూరిటీ డ్రిల్‌ను ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపినాథ్ జెట్టి,పర్యవేక్షణలో నిర్వహించారు. సముద్ర తీర భద్రతలో ఉన్న లోపాలను గుర్తించి, వాటిని సరిచేసి మరింత బలోపేతం చేయడం ఈ వ్యా యామం ప్రధాన లక్ష్యంగా కొనసాగింది.డ్రిల్‌లో భాగంగా 14 ప్రాంతాల్లో రెడ్ ఫోర్స్ శత్రు బృందం చొరబడి బాంబులు పెట్టే ప్రయత్నం చేయగా, బ్లూ ఫోర్స్‌గా వ్యవహరించిన పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా ప్రతిస్పందించారు. అప్రమత్తత తో చర్యలు తీసుకుని 30 మంది 'శత్రువులను' పట్టుకుని తీర భద్రతపై తమ సత్తా చాటారు.

మొత్తం మీద రెండు రోజుల పాటు జరిగిన ఈ ఎక్సర్సైజ్ విజయవంతంగా ముగియగా, రాష్ట్ర తీర భద్రత వ్యవస్థ మరింత బలోపేతం అయిం దని అధికారులు తెలిపారు.

## ఏయూ శతాబ్ది వేడుకల్లో ఫుడ్ కార్వింగ్‌తో విద్యార్థుల వినూత్న శుభాకాంక్షలు




**ఎ యు.పెన్ పవర్, ఏప్రిల్ 16:**ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు వేడుకగా కొనసాగుతున్న నేపథ్యంలో, అనుబం ధ కళాశాలైన ఎలియన్స్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ప్రత్యేకమైన ఫుడ్ కార్వింగ్ ప్రదర్శనతో విశ్వవిద్యాలయానికి శుభాకాంక్షలు తెలిపారు.వందేళ్ల ప్రయాణాన్ని గుర్తుచేస్తూ విద్యార్థులు పండ్లు, కూరగాయలను వినూత్నంగా మలిచి కళాత్మక కృతులను రూ పొందించారు. పుష్పగుచ్ఛాలు, హంసలు, కేక్ నమూనాలు వంటి ఆకర్షణీయమైన ఆకృతుల తో శతాబ్ది ఉత్సవాల సందేశాన్ని సృజనాత్మకం గా ప్రతిబింబించారు.ఈ కార్యక్రమాన్ని సందర్శిం చిన ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య జి.పి. రాజ శేఖర్ విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. నే ర్చుకున్న నైపుణ్యాలను ప్రాయోగికంగా చూపు తూ, విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాలకు కళా త్మక రూపం ఇచ్చిన తీరు అభినందనీయమన్నా రు.

ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె. రాంబాబు, వివిధ కళాశా లల ప్రిన్సిపాల్స్, డీన్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారత్ గ్యాస్ అవినీతి లీలలు వినియోగదారులను మోసం చేసి అధిక లాభాలు



**సాలూరు ఏప్రిల్ 16 పెన్ పవర్.** సాలూరు మండలం మరిపల్లి సమీపంలో సాయి కామాక్షి భారత్ గ్యాస్ ప్రభుత్వము నుండి అనుమతులు తీసుకొని మండలములో గ్యాస్ సరఫరా చేస్తున్నారు వివరాలు ఎలా ఉన్నాయి పేద ప్రజల కోసం 2016 సంవత్సరంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ప్రారంభించారు. మండలంలో గ్యాస్ వినియోగదారులు ఆఫీసుకు వచ్చి తమ యొక్క గ్యాస్ సిలిండర్ తీసుకొని వెళ్లేవారు మండలంలో కొండలపై ఉన్న గిరిజన గ్రామాలు ప్రజలు ఎక్కువగా గ్యాస్ వినియోగించని కారణంగా గిరిజనులు నాలుగు నెలలకు ఒక బండ విడిపించడం చాలా కష్టం అవుతుంది ఆర్థిక స్తోమత లేని కారణంగా వారి గ్యాస్ సిలిండర్లు విడిపించారు. సమస్త యజమాని దీనిని గుర్తించి అవినీతికి పాల్పడి వేలాది రూపాయలు లాభాలు అర్జిస్తూ ఉన్నారు. సాలూరు పట్టణంలో హోటల్స్, రెస్టారెంట్లు దాబాలు టీ షాపులు, యజమానులకు 14 కేజీల గ్యాస్ బండ ధర 950 రూపాయలు చిన్న బండను షాపు యజమానులకు 2000 రూపాయలకు అమ్ముతున్నారు. సమాచారం తెలుసుకున్న తూనిక కొలతలు అధికారులు భారత్ గ్యాస్ యజమాని ఆటోలో గ్యాస్ సిలిండర్లు మరి పల్లి నుండి సాలూరు అక్రమంగా రవాణా చేస్తుండగా అధికారులు చెకింగ్ చేసి గ్యాస్ సిలిండర్లో తక్కువగా ఉందని గుర్తించారు. సమీపంలో ఉన్న మామిడిపల్లి గ్రామంలో హోటల్స్ కు నూడుల్స్ టీ స్టాల్కు. చిన్న బండ లో ఉన్న గ్యాస్ ను మిషన్ ద్వారా పెద్ద బండకు ఫుల్ చేసి వ్యాపారులకు అమ్ముతున్నాడు. పౌర సరఫరా అధికారులు చూచి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు లాభాలు అర్జిస్తున్న భారత్ గ్యాస్ యజమాని మూడు పువ్వులు ఆరు కాయలుగా దిన దినము అభివృద్ధి చెందుతూ అధికారులకు అధికారులకు ముడుపులు చెల్లిస్తూ దర్జాగా వ్యాపారం చేస్తున్నాడు. పేదలకు అందవలసిన గ్యాస్ సిలిండర్లు సకాలంలో అందడం లేదని మైదాన ప్రాంతాల్లో ఉన్న గ్యాస్ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు విచారణ జరిపి అక్రమంగా వ్యాపారం చేస్తున్న గ్యాస్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

## మోదకొండమ్మ జాతరపై రాజకీయాలు తగవు



**గూడెం కొత్త వీధి/చింతపల్లి,పెన్ పవర్,ఏప్రిల్ 16:** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవమైన పాడేరు శ్రీ శ్రీ మోదకొండమ్మ జాతర విషయంలో కూటమి నాయకులు రాజకీయాలు చేయడం తగదని వైఎస్సార్సీపీ నాయకులు మండిపడ్డారు. అమ్మవారితో ఆటలాడొద్దని హెచ్చరించారు.


గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పాడేరు ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు కలిసి జాతర తేదీలను మే 10, 11, 12గా నిర్ణయించారని తెలిపారు. అయితే గిరిజన మంత్రి గుమ్మడి సంధ్యారాణి జాతరను మే 17, 18, 19 తేదీల్లో నిర్వహిస్తామని ప్రకటించడం గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధమని విమర్శించారు.తల్లి పుట్టినరోజు, ముహూర్తం వంటి అంశాల ఆధారంగా నిర్ణయించిన తేదీలను కమిటీకి తెలియకుండా మార్చడం సరికాదన్నారు. ఇది అఖిలపక్ష నిర్ణయమని, ఈ విషయంపై సంబంధిత నాయకులకు కూడా పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. కావాలనే తప్పుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే పలు ఆధ్యాత్మిక అంశాలను రాజకీయాలకు వాడుకోవడం ద్వారా విమర్శలు ఎదుర్కొన్న కూటమి నాయకులు, ఇప్పుడు మోదకొండమ్మ జాతర విషయంలో కూడా జోక్యం చేసుకోవడం తగదని అన్నారు. మొదట నిర్ణయించిన తేదీలను ఒక నాయకుడి వ్యక్తిగత కార్యక్రమం కారణంగా మార్చడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు.ఇప్పటికైనా కూటమి నాయకులు పునరాలోచించి, ముందుగా ఖరారు చేసిన తేదీల్లోనే జాతరను నిర్వహించాలని, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో జీకే వీధి వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీలు బోయిన కుమారి, కోరాబు అనూష దేవి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి బూసరి కృష్ణారావు, రాష్ట్ర కార్యదర్శి జల్లి సుధాకర్, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు సాగిన గంగన్న పడాల్, మండల ఉపాధ్యక్షుడు రీమల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, విద్యార్థి విభాగం నాయకుడు పసుపులేటి సోమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు మొబైల్స్ కు దూరంగా ఉండి, పుస్తకాలు చదవండి

- శారద నికేతన్ పాఠశాలలో స్థానిక ఎంపిడిఒ సూచన.
- వేసవి సెలవుల్లో పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన.
- శారదనికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ మత్స్యరాజు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 16.**వేసవి సెలవుల్లో పిల్లలు మొబైల్ ఫోన్స్ కు దూరంగా ఉండి పుస్తకాలు చదువుకోవాలని ముంచంగిపుట్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె ధర్మారావు తెలిపినట్లు శారదనికేతన్ ప్రిన్సిపాల్ సిహెచ్ మత్స్యరాజు తెలిపారు. గురువారం ప్రిన్సిపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. ముంచంగిపుట్టు మండల కేంద్రములో గల శారద నికేతన్ పాఠశాలలో గురువారం ఉదయం 8:30 గంటల సమయంలో ఎంపీడీవో సందర్శించారు. విద్యార్థులతో సమావేశమై ప్రధానంగా వేసవి సెలవులలో పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంపీడీవో మాట్లాడుతూ.. సెలవుల్లో పిల్లలు చెరువులు, సమీపంలో గల గెడ్డల వద్ద ఆటల కోసం ఈత కొట్టుటకు వెళ్లరాదని సూచించారు. అదేవిధంగా అటవీ ప్రాంతంలో తిరగ వద్దని, ఇంట్లో తరచుగా మొబైల్ గేమ్స్ ఆడవద్దని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఎండలో ఆటలకు పోవద్దన్నారు. పరిశుభ్ర మైన నీరు త్రాగి దాహం తీర్చుకోవాలని, ముఖ్యంగా కొబ్బరినీరు వంటివి తీసుకోవాలన్నారు. సెలవులలో ఖాళీ సమయాల్లో మంచి కథలు పుస్తకాలు చదువుకోవాలనీ, క్రమశిక్షణతో మెలగలంటు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు దొన్ను, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లి దండ్రులకు పాల్గొన్నారు.




## విశాఖ దక్షిణంలో సానిటేషన్ శిక్షణ కార్యక్రమం నిరుత్సాహకరంగా ముగింపు





**విశాఖ దక్షిణ ఏప్రిల్ 16:(పెన్ పవర్)**విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని 38, 39, 41వ వార్డుల్లో నిర్వహించిన కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వలేకపోయింది. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం భాగంగా జీవీఎంసీ అధికారుల ఆహ్వానం మేరకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బుచ్చ రాము రెడ్డి, డైరెక్టర్ ఎం నాగలక్ష్మి పాల్గొన్నప్పటికీ, సానిటేషన్ వర్కర్లలో స్పష్టమైన అవగాహన పెరగలేదని సమాచారం.

సానిటరీ వర్కర్స్ తీసుకోవలసిన జాగ్రత్తలు, పనితీరు విధానాలపై వివరణ ఇచ్చినప్పటికీ, కార్యక్రమం ప్రభావం తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో 38, 39వ వార్డు సానిటరీ సిబ్బంది, 41వ వార్డు సానిటరీ ప్రతినిధులు నెల్లి కనకరాజు, ఎస్ విజయ్ కుమార్, బుజ్జి గణేష్ పాల్గొన్నారు.

అయితే, నిర్వహణ లోపాలు మరియు తగిన ప్రణాళికాభావం కారణంగా ఈ శిక్షణ కార్యక్రమం లక్ష్యాలను చేరుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

## శాంతిభద్రతకు సమిష్టి కృషి.

- ఎస్ ఐ. మల్లేశ్వరరావు.



**అరకులోయ పెన్ పవర్ 16:**ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ నియోజకవర్గం మండల కేంద్రంలో నూతనంగా నియమితులైన ఎస్ఐ మల్లేశ్వరరావుతో ఏపీడబ్ల్యూజేఎఫ్ పత్రిక సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.. సాధారణంగా ఆయనతో కలిసి లక్కీ బాంబో ప్లాంట్ ఇచ్చి ఆయనకు దుస్సాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.. ఎస్.ఐ. మల్లేశ్వరరావు మాట్లాడుతూ అరకులోయ శాంతిభద్రతలు కాపాడటానికి పాత్రికేయుల సహాయ సహకారం ఎల్లప్పుడూ అవసరమని ఆయన తెలిపారు. గంజాయి మత్తు పదార్థాలు, మారకద్రవ్యాలు, నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా కృషి చేద్దామని ఏపీయుడబ్ల్యుజేఎఫ్ మండల నాయకులకు ఆయన ఒక ప్రకటనలు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బిమిడి త్రినాథ్, ఉపాధ్యక్షుడు కిల్లో సామ్యూల్, కార్యదర్శి వంతల డేవిడ్, ప్రధాన కార్యాదర్శి కిల్లో సింహాచలం, కోశాధికారి కొర్ర సింహాద్రి, సభ్యులు కిల్లో రామన్న, మహేష్, సన్యాసి, రాంబాబు, కోటేశ్వరరావు, తదితరులు, పాల్గొన్నారు.

## కొల్లి రాఘవేంద్ర రావు కి "తెలుగు శక్తి" బి.వి.రామ్ నివాళి





**విశాఖ ఏప్రిల్ 16(పెన్ పవర్)**బిజెపి సీనియర్ నాయకురాలు కొల్లి రత్నకుమారి భర్త స్వర్గీయ కొల్లి రాఘవేంద్ర రావు దశ దిన కర్మ కార్యక్రమంలో గురువారం మధ్యాహ్నం కాకతీయ ఫంక్షన్ హాల్, మద్దిలపాలెం, విశాఖపట్నంలో తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ పాల్గొని నివాళులర్పించారు. ఈ సమయంలో వారి కుటుంబ సభ్యులకు ముఖ్యంగా కొల్లి రత్నకుమారికి భగవంతుడు వారికి ధైర్యం, శక్తి ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. మా తండ్రి గారైన స్వర్గీయ బి.వి.రామారావుతో వారి కుటుంబ సభ్యులతో మంచి అనుబంధంగా ఉండేదని, ఈ సందర్భంగా బి.వి.రామ్ గుర్తు చేసుకున్నారు.

అనంతరం అక్కడే ఉన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ ను కలుసుకున్నారు.

## విజ్ఞాన్ దువ్వాడలో నెక్స్ట్-జెన్ యాక్సెస్ నెట్‌వర్క్స్‌పై మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్






**కూర్మన్నపాలెం :పెన్ పవర్ , ఏప్రిల్ 16:** విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ , దువ్వాడలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, బీఎస్ఎన్ఎల్ రీసెర్చ్, ఇన్నోవేషన్ అండ్ ఇన్క్యూబేషన్ సెంటర్ సహకారంతో నెక్స్ట్-జెన్ యాక్సెస్ నెట్‌వర్క్స్ విత్ ఎమర్జింగ్ ఇండస్ట్రీ 4.0 చాలెంజెస్ అండ్ సొల్యూషన్స్ లెవల్-1 అనే అంశంపై ఏప్రిల్ 16 నుండి 18 వరకు మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు .

బీఎస్ఎన్ఎల్ రీసెర్చ్, ఇన్నోవేషన్ అండ్ ఇన్క్యూబేషన్ సెంటర్‌ను బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డా. ఎం. సత్య ప్రసాద్ అధికారికంగా ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా ఆధునిక కమ్యూనికేషన్ సాంకేతికతలు మరియు ఇండస్ట్రీ 4.0 అనువర్తనాలపై పరిశోధన, ఆవిష్కరణలు మరియు పరిశ్రమ--విద్యాసంస్థల మధ్య సహకారాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఉందని , నెక్స్ట్-జెనరేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీల ప్రాముఖ్యతను అతిథిలు వివరించారు. ఐఓటీ, 5జీ/6జీ నెట్‌వర్క్స్, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి ఇండస్ట్రీ 4.0 ధోరణులపై ఫ్యాకల్టీ నిరంతరం అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని హైలైట్ చేశారు. ఎఫ్‌డీపీ ద్వారా అధ్యాపకుల సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా, ఆధునిక యాక్సెస్ నెట్‌వర్క్ టెక్నాలజీలు, అమలులో ఎదురయ్యే సవాళ్లు మరియు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన వినూత్న పరిష్కారాలపై నిపుణులు సేషన్లు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొంటూ, తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటున్నారు. ఇది నిరంతర అభ్యాసం మరియు అకాడమిక్ ప్రతిభపై వారి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదనరావు, ఈసీఈ విభాగాధిపతులు డా. ఆర్. ఉమా మహేశ్వరి , డా. పి. సంతోష్, అధ్యాపకులతో కలిసి ముఖ్య అతిథికి కృతజ్ఞతలు తెలియజేశారు , కార్యక్రమం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## అత్యధిక మార్కులు సాధించి ప్రతిభను కనబరిచిన విద్యార్థినిలు






**పలాస, పెన్ పవర్ : ఏప్రిల్ 16...**బ్రాహ్మణతర్లా హై స్కూల్ ప్లస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులు బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభను కనబరిచినట్లు ప్రిన్సిపాల్ తారకేశ్వర పండా తెలిపారు. ప్రథమ సంవత్సరం ఆర్ సుజాత 448 మార్కులు ఎంపీసీ, కె. రేష్మ 405 ఎంపీసీ, పి జోత్స్న 430 బైపిసి, ఎమ్. నీరజ 417 బైపిసి మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థిని లు పి. పల్లవి 962 ఎంపీసీ, పి. ప్రశాంతి 958 ఎంపీసీ, ఎన్. మౌనిక 964 బైపిసి, పి. రమ్య 956 బైపిసి మార్కులను సాధించారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆర్ బాల శంకరం అభినందించారు. ఈ సందర్భంగా హై స్కూల్ సిబ్బంది మరియు హై స్కూల్ ప్లస్ అధ్యాపకులు ఏ. ఈశ్వరరావు, ఏ. మధు బాబు, ఆర్. రమేష్, పి. ఈశ్వరరావు, బి. సుధా కుమారి, డి. మెహర్ సుధా ప్రతిభాను కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

## నందవరపు సోములకు కళా సేవాపీఠం ఘన సత్కారం





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 16** : సమాజ సేవలో నాలుగు దశాబ్దాలుగా విశిష్ట సేవలందిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్న నందవరపు సోములకు రాష్ట్ర ప్రభుత్వం ప్రదానం చేసిన ఉగాది పురస్కారం సందర్భంగా గోపాలపట్నం కళా సేవాపీఠం ఆధ్వర్యంలో ఘనంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం గోపాలపట్నం గ్రంథాలయంలో ఆదరణీయంగా జరిగింది.

కళా సేవాపీఠం గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నందవరపు సోములు అందిస్తున్న సేవలు సమాజానికి మార్గదర్శకమని కొనియాడారు. ఆయన కృషి మరింత ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. సంస్థ అధ్యక్షులు గోరపల్లి బంగార్రాజు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే సామాజిక సేవలో నిమగ్నమైన సోములు, గత 40 సంవత్సరాలుగా పద్మనాభ నగర్ పరిసర గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యా విస్తరణ, మహిళా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు విశేష సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే క్రమంలో ఆయన పట్టుదల ప్రశంసనీయం అన్నారు. మాజీ అధ్యక్షులు గోరకల రామదాసు మాట్లాడుతూ, పేదల సమస్యల పరిష్కారంలో సోములు నిరంతరం కృషి చేస్తూ బడుగు, బలహీన వర్గాలకు ఆత్మబంధువుగా నిలుస్తున్నారని అభినందించారు. ప్రధాన కార్యదర్శి కొంతం నూక రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు, గుడిసెల్లో నివసించే వారికి గృహ నిర్మాణ పథకాల ద్వారా ఇండ్లు కల్పించడంలో, గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వ పథకాల ద్వారా సహకరించడంలో సోములు చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్స్ జాకప్ రాజు, ఎం.ఎస్.వి. శ్రీనివాస్, గ్రంథాలయ అధికారి ఎన్.వి. నరసింహం, కొమ్మాది వెంకట్రావు, అలాగే కమిటీ సభ్యులు బెవర రమేష్, కొప్పు శెట్టి వెంకట్, బండారు శ్రీనివాసరావు, సి.హెచ్.వి. మల్లీశ్వర ప్రసాద్, వల్లూరి జగదీష్ చంద్రశేఖర్, బల్ల రమణ తదితరులు పాల్గొని సోములు చేసిన సేవలను ప్రశంసించారు. మహిళా ప్రతినిధులు నన్నపనేని మల్లికా చౌదరి, కంపర రాజ్యలక్ష్మి, ఏ.శోభారాణి, కేత వెంకట నాగలక్ష్మి, ఎం. విమల మాట్లాడుతూ మహిళా అభివృద్ధి, స్వయం ఉపాధి, డ్వాక్రా గ్రూపుల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధనలో సోములు చేసిన కృషి ఎంతో ప్రేరణాత్మకమని పేర్కొన్నారు. కార్యక్రమం చివరలో నందవరపు సోములను కళా సేవాపీఠం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ సత్కారం నిర్వహించాయి.

## గ్రామసభలో వినతుల పరిష్కారానికి చర్యలు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 16:** గ్రామసభలో వచ్చిన వినతులను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జీకే వీధి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి దాసరి గిరిబాబు తెలిపారు.గురువారం జీకే వీధిలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆయన మాట్లాడుతూ---గిరిజనులు గ్రామసభపై విశ్వాసంతో తమ సమస్యలు, వినతులను సమర్పించారని అన్నారు. వాటిపై ప్రత్యేక తీర్మానాలు చేసి పరిష్కారానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సభలో సభ్యులు గతంలో పంచాయతీ చేసిన తీర్మానాలను సమీక్షించాలని, పంచాయతీ నిధులు సక్రమంగా వినియోగించాయో లేదో పరిశీలించాలని ప్రత్యేక అధికారిని కోరారు. అలాగే వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, క్లాప్ మిత్రులకు వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు పసుపులేటి నాగమణి,రిమెల రాజేశ్వరీ, తాజా మాజీ సర్పంచ్ కొర్ర సుభద్ర, పేసా కమిటీ సభ్యులు కూటమి నాయకులు గొర్లె వీర వెంకట్, కొర్ర బలరాం, సిద్ధార్థ మార్క్, పి. నీలకంఠం, పంచాయితీ కార్యదర్శి పండ్రా పాల్ తదితరులు పాల్గొన్నారు.

# జీవం ఉన్న పంటలనే ఆహారం గా భుజించాలి





- ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం అవసరం
- ప్రకృతి పంటలే ఆరోగ్యకరం, ఆనంద దాయకం
- జన్యుమార్పిడి పంటలు వద్దే వద్దు
- పేరి రామకృష్ణ , విశ్రాంత డిప్యూటీ కలెక్టర్

**విశాఖ ఏప్రిల్ 16(పెన్ పవర్)** జీవం ఉన్న పంటలనే ఆహారం గా భుజించాలి అని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం అనకాపల్లి జిల్లా బుచ్చయ్య పేట మండలం లోని కొండ పాలెం అగ్రహారంలో ప్రకృతి పంటల క్షేత్రం సందర్శించిన వారితో ఆయన మాట్లాడారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ నేతృత్వంలో కొద్దిమంది ఔత్సాహిక రైతులు వారు ప్రకృతి ఆధారంగా పంటలు ఎలా పండించుతున్నది పరిశీలించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవం ఉన్న పంటలతో మన పూర్వీకులు వంటలు ఎలా చేసుకున్నారో అలాంటి రుచి కరమైన, సుచికరమైన, ఆరోగ్యకరమైన వంటలు వండటం, భుజించడం, అవగాహన కలిగించడం నేటి తరానికి అవగాహన కల్పించడం అవసరం అన్నారు. అలాగే పాత ఇత్తడి, మట్టి పాత్రలలో వంటడం ఉపయుక్తం అన్నారు. జన్యుమార్పిడి పంటలు వద్దే వద్దు అన్నారు. మనం మన సంస్కృతిని, కళలను కాపాడుకోవాలి అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గోవర్ధన గిరి గోశాల ప్రతినిధి దొడ్డా మహేష్, ఔత్సాహిక ప్రకృతి పంటల రైతు నరేష్, మేంగొ మేన్ అప్పాజీ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

## డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం మరియు ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్.** డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం మరియు ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం ఎమ్ ఒ యూ పరిపాలనాభవనం లో జరిగింది .

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నేపథ్యంలో, హైదరాబాద్ రాజేంద్రనగర్ నుండి గుంటూరు జిల్లా లామ్ గ్రామానికి, ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తరలించబడిన తరువాత, డా వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంతో కుదుర్చుకున్న మొదటి ఒప్పందం. డా. వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కె. ధనుంజయరావు చొరవతో, రెండు విశ్వవిద్యాలయాల ఉన్నతాధికారులు చర్చించి, అవసరమైన అంశాలు ఒప్పందంలో చేర్చడమైనది.

ఈ రెండు విశ్వవిద్యాలయాలు
భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి పరిధిలోకి వస్తాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా, మన రాష్ట్రంలో రైతులకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించిన నిపుణుల సలహాలు, సాంకేతిక పరిజ్ఞానం సమన్వయంతో, త్వరితగతిన అందించటానికి మరియు గ్రామ స్థాయిలో ఉన్న రైతు సేవా కేంద్రాలను బలోపేతం చేయడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుంది " అని ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కట్టుపల్లి ధనుంజయరావు తెలియజేశారు.
అంతేకాక
ఈ ఒప్పందం ద్వారా రెండు విశ్వవిద్యాలయాల పోస్ట్ గ్రాడ్యుయేషన్ ( పీజీ) విద్యార్థులు మరియు పీ. హెచ్.డీ పరిశోధకులు తమ పరిశోధనల కోసం ఆయా విశ్వవిద్యాలయాల సదుపాయాలు మరియు ప్రయోగశాలలను ఉపయోగించుకోవచ్చు, సంబధిత శాస్త్రవేత్తల నుండి అవసరమైన మార్గదర్శకత్వం పొందవచ్చు.

ఈ ఒప్పందం ద్వారా పేటెంట్ హక్కులు సద్వినియోగం చేసుకుంటూ, ఆయా విశ్వవిద్యాలయల బోధనా సిబ్బంది మరియు శాస్త్రవేత్తలు విద్యాసంబంధ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించుకోవచ్చు.

ఈ రెండు విశ్వవిద్యాలయాలు రాబోయే సంవత్సరాల్లో ఉద్యాన, వ్యవసాయ రంగానికి సంబంధించి సంయుక్త నిర్వహణలో విస్తరణ కార్యక్రమాలు, సెమినార్లు , సమాచార మార్పిడి, ప్రణాళిక వర్క్‌షాప్‌లు, నిర్వహించడం, పరిశోధనా పత్రాలు ప్రచురించడం, సర్టిఫికెట్ ప్రోగ్రామ్ నిర్వహించడం వంటివి ఈ ఒప్పందంలో ముఖ్యాంశాలుగా ఉన్నాయని ఉపకులపతి డా.కె. ధనుంజయరావు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయం తరుపున ఉపకులపతి డా.కె. ధనుంజయరావు, రిజిస్ట్రార్ డా. ఎమ్. మాధవి, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డా. సీఎహ్ రూత్ పాల్గొన్నారు.

ఆచార్య ఎమ్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తరుపున వైస్ ఛాన్సలర్ డా. ఆర్. శారదా జయలక్ష్మి దేవి, రిజిస్ట్రార్ డా. ఎమ్వి. రమణ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సూర్య కాలేజి విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



**పెన్ పవర్ ఉంగుటూరు ఏప్రిల్ 16:**ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉంగుటూరు మండలం గొల్లగూడెంకు చెందిన సూర్య ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు మంచి మార్కులు సాధించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థులను ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అభినందించి సన్మానించారు. విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ వేములపల్లి దుర్గా చైతన్య కుమార్, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు వేములపల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలు పై అవగాహన కార్యక్రమలు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 16:**ఫైర్ సర్వీస్ వీక్ లో భాగంగా 3వ రోజు తాడేపల్లిగూడెం అగ్ని మాపక కేంద్రాధికారి కె వి మురళీ కొండ బాబు ఆద్వర్యశీలో తాడేపల్లిగూడెం పట్టణం మరియు చుట్టుప్రక్కల గ్రామాలలో ఉన్నటువంటి రెసిడెన్షియల్ అపార్ట్మెంట్ల వద్దకు వెళ్లి అక్కడ నివాసితులకు ఎల్పిజి గ్యాస్ సేఫ్టీ పై, ఎలక్ట్రికల్ సేఫ్టీ పై, అజాగ్రత్తగా పొగత్రాగుటపై మరియు ఫైర్ హజార్డ్ మొదలగు వాటి వల్ల సంభవించే అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, అగ్ని ప్రమాదాల నిహారణ మరియు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వారికి అవగాహన కార్యక్రమములు చేపట్టి, ఫైర్ సేఫ్టీ పోస్టర్లను రెసిడెన్షియల్ అపార్ట్మెంట్ల ప్రాంగణము నందు అతికించడమైనది. మరియు అపార్ట్మెంట్లలో నివసించే ప్రజలకు అగ్నిమాపక వారోత్సవాల కర పత్రములను పంచి అగ్నిప్రమాదాల నివారణ చర్యలు గురించి వివరించారు. అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

## చేపల మార్కెట్ ను పరిశీలించిన కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 16:**చేపల మార్కెట్ లో కొనుగోలుదారులు, అమ్మకపుదారులకు ఇబ్బందులు కలగకుండా తగు సౌకర్యాలు కల్పించాలని అధికారులను కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. 32వ వార్డు జాంపేట ఫిష్ మార్కెట్ ను రెవిన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి గురువారం ఉదయం ఆయన పరిశీలించారు . ఈ సందర్భంగా విక్రయదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్లాబ్, ఫ్లోర్ సహా మరమ్మతులకు సంబంధించి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు ఎల్లవేళలా సిద్ధమని తెలియజేశారు. ఫిష్ మార్కెట్ లో వ్యర్థాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని విక్రయదారులకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎస్ఈ రీటా, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ వినూత్న, డీఈ సత్యనారాయణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

## పాఠశాల భవన నిర్మాణానికి 50 వేలు విరాళం అందించిన ఉపాధ్యాయుడు

- పాఠశాల భవనంలేనీ విద్యార్థుల కష్టాలు చూసి ఆర్థిక సహాయం చేసిన ఉపాధ్యాయుడు జి కామేశ్వర రావు.
- కామేశ్వరరావును కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థుల తల్లిదండ్రులు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 16.**మండలంలో గల ఏనుగురాయి పంచాయితి, ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గల్లెల కామేశ్వరరావు పాఠశాల భవన నిర్మాణానికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఎన్నోఏళ్ళుగా బోండాపుట్టు పాఠశాలలో భవనంలేక పాకలోనే విద్యార్థినీ విద్యార్థులను కూర్చోబెట్టి విద్యాబోధనా చేసే పరిస్థితి. వేసవికాలం చెట్టు క్రింద, వర్షకాలం, చలి కాలం చిన్న పాకలో తరగతులు నిర్వహించేవారు. ఈ నేపథ్యంలోనే రానున్న విద్యాసంవత్సరంలో విద్యార్థులకి చదువుకు ఆటంకం కలగరాదని ఉద్దేశంతో ప్రధానోపాధ్యాయులు గల్లెల కామేశ్వరరావు చిన్న భవనం నిర్మాణానికి విరాళంగా తన వంతు 50వేల రూపాయలు ఇచ్చి తన ఉదారతాను చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. బొండపుట్టు గ్రామంలో పాఠశాల విద్యాభివృద్ధి కోసం, చిన్నారుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయుడు అందించిన 50 వేల రూపాయలు విలువైన సహాయము ప్రశంస నీయమైనదన్నారు. సమాజ అభివృద్ధి పట్ల ఉపాధ్యాయునికి ఉన్న నిబద్ధత, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందనీ, ఈ గొప్ప సహకారం వల్ల విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తుందన్నారు. విరాళం అందించిన ఉపాధ్యాయునికి విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల భవనంలేక విద్యాబోధనలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిస్థితుల దృష్ట్యా తనవంతు సహాయం చేసినట్లు ఉపాధ్యాయుడు కామేశ్వరరావు పేర్కొన్నారు.

## 66 వార్డ్ ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పన



**గాజువాక :పెన్ పవర్ ,ఏప్రిల్ 16** పారిశ్రామిక ప్రాంతం గాజువాక నియోజవర్గంలో ప్రభుత్వం వచ్చి 22 నెలల్లో 66వ వార్డులో 90 శాతం పనులు పూర్తి చేసే దిశగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చొరవతో పూర్తి చేయడం జరిగిందని . గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన అజీమా బాద్ లో ఉన్న ప్రధాన మసీద్ రోడ్డు పనులు చేరవేగంగా జరుగుచున్నవి అలాగే బాల చెరువు రోడ్డు అరుణాలర్జున్ ఆపోజిట్ రోడ్డుతో పాటు,కాలవు లు పనులు కూడా ఎంతో త్వరగా పూర్తి చేస్తున్నారు, కైలాష్ నగర్ లో కానీ బాల చెరువు రోడ్ లో కానీ ఉన్న బ్యాలెన్స్, వర్కులు రోడ్డు పనులు చాలా తొరగా పనులు,చేస్తున్నారు గోమాడ తెలిపారు . ఇంకా ఉన్న పనులు కూడా పూర్తి చేస్తామని పల్లా హామీ,ఇవ్వటంతో పనులను దగ్గరుండి 66,వార్డు అధ్యక్షులు గోమాడ వాసు, వార్డు సీనియర్ తెలుగుదేశం నాయకులు పార్టీ నాయుడు, తదితరులు పనులుని పరిశీలించారు . గాజువాక నియోజవర్గంలో ఏ మూలకు వెళ్లిన, జరుగుతున్న పనులని చూసి ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూన్నారని , ప్రత్యేకంగా రెండోసారి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గా మరల ఎన్నికైన శ్రీనివాసరావుకి 66వార్డ్, ప్రజలు అభినందనలు తెలిపారు .

## లోక్అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విదంగా చూడాలి

పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి యు. మాధురి



**పలాస, పెన్ పవర్ : ఏప్రిల్ 16** :పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మే 9వ తేదిన నిర్వహించనున్న లోక్ ఆధాలత్ తో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా చూడాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి యు. మాధురి అన్నారు. గురువారం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, కాశీబుగ్గ వజ్రపుకొత్తూరు పోలీసు అధికారులు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. లోక్అదాలత్ లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని అదేవిధంగా కేసులలో చర్చలు జరిపి రాజీ చేస్తామని న్యాయమూర్తి యు. మాధురి తెలియజేశారు. కాశీబుగ్గ, వజ్రపు కొత్తూరు పోలీస్ అధికారులు సిబ్బంది తక్షణమే చర్యలు చేపట్టి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పి. రమేష్ అసిస్టెంట్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాశిబుగ్గ ఎస్సై ఆర్. వి.ఆర్. నాయుడు వజ్రపు కొత్తూరు కాశిబుగ్గ పోలీసు సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

వలాస కోర్టు ఆవరణలో పలాస,వజ్రవుకొత్తూరు మండలా అధికారులతో ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. లోక్అధాలతో రాజీ కాబడే కేసులు గుర్తించి రాజీ వడే విదంగా చూడాలని, అంతే కాకుండా ముందస్తు లోక్ అధాలత్లు కూడా నిర్వహించి కేనులు రాజీ చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు.. పెండింగ్లో ఉన్న రాజీ వడే క్రిమినల్ కేసులు రాజీ చేసుకునే ఈ అవకాశాన్ని కక్షిదారులకు తెలియజేసి లోక్ అదాలత్లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విదంగా చూడాలని పోలీసులకు సూచించారు...

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com